# కూచిపూడి భామాకలాపము



శ్రీ సిద్ధేంద్ర కృత భామా కలాప శిథిల గ్రంథః

నృత్యాచార్య

శ్రీ వేదాన్తమ్ పార్వతీశశాస్త్రిణా పూరితమ్

KUCHIPUDI BHAMAKALAPAMU

VEDANTAM PARVATISHAM
SHASTRI

Published by the Author

MUVVA MANDALAM (A.P.)

1982

20, 95p.

Rs 5=00

G-245

# కూచిపూడి భామా కలాపము

★

శ్రీ సిద్ధేంద్ర కృత భామా కలాప శిథిల గ్రంథః

నృత్యాచార్య

శ్రీ వేదాన్తమ్ పార్వతీశశాస్త్రిణా పూరితమ్



అమ్మా! తమ్మిచూలికొమ్మా!
నవరస నటనల బొమ్మా!
అమ్మ లమ్మలలో దొడ్డమ్మా!
భాషా కౌశల మిమ్మ జ్ఞానమ్మ! ॥వందే॥

★

కాపీరైటు రిజిష్టర్డు] [మూల్యం : రు. 5-00

Te
793.31954 Ku
PAR-M2

సర్వస్వామ్యములు పార్వతీశమ్ గారివి.

శ్రీ దుందుభి నామ సంవత్సర శ్రావణ మాసము
1982

ప్రతులు :
౧౦౦౦

Accn. No. G245
Date 17-9-1993
Lang. Telugu
Call No.

మూల్యం :
రు. 5-00

కనుడీ-శ్రీ పార్వతీశ కవి పూరణమున్ :
గ్రామఫోను-రేడియో-టెలివిజన్ అన్యభాషాంతరీక
ములకు నా అనుమతి లేక చేయరాదు —

ప్రాప్తిస్థానము :
వి. పార్వతీశమ్
కూచిపూడి పోస్టు, మొవ్వ తాలూకా,
కృష్ణాజిల్లా, కూచిపూడి-521136. ఆం. ప్ర.

ముద్రణ :
శ్రీ బాలాజీ ప్రింటర్స్,
సామారంగం చౌక్, విజయవాడ-520 001.



[ మతసంబంధమైన గ్రంథాల ప్రచురణకు తోడ్పడే పథకం క్రింద తిరుమల తిరుపతి దేవస్థానమువారు అందజేసిన ఆర్థిక సహాయముతో ఈ గ్రంథము ప్రచురింపబడినది. ]

★

**"This book is published with the financial assistance of Tirumala Tirupati Devasthanams under their scheme aid to publish religious books."**

# ఆశీస్సులు

నృత్యాచార్యులు శ్రీ వేదాంతం పార్వతీశముగారు దయాదరములతో పంపిన భామా కలాపము ద్వితీయ ముద్రణము నాద్యంతము చదివి యానందించితిని. ఇది భక్తవరేణ్యుడు, కూచిపూడి నాట్యమున కాదిపురుషుడునైన సిద్ధేంద్రయోగి రచన. ఆ మహనీయుడు దీనిని రచించి తాళపత్ర ప్రతిని కూచిపూడి బ్రాహ్మణోత్తముల కిచ్చినారు. "ద్వాదశ శతవర్ష తాళపత్రపు లిపి నోటిపాఠాలతో సూటితప్పినది." కొన్ని దరువులు, కందార్థములు, అక్షర పంక్తులు నష్టములై పోయినవి. మరల ఆ యోగిపుంగవుడే నృత్యాచార్య పార్వతీశముగారికి కలలో కనబడి శిథిల భాగములను పూరింపజేసినాడు. నృత్యాచార్యులు "బంగరు పూవుల పూజసేయ కర్పూరహారతుల కైదండ లిడుదు" అని సంతోషముతో పూరించి ఆ భామా కలాపమును లోకమున కందిచ్చినారు. అచ్చటచ్చట వారు పారిజాతాపహరణాదుల నుండి సందర్భోచితముగా కొన్ని పద్యములను చేర్చినారు. కొంత హాస్యమును తగ్గించినారు. ఈ విధముగా వారు కృష్ణసాయుజ్యము నొందిన సిద్ధేంద్రయోగి భామా కలాపమును ఔచిత్యశోభితమైన తమ పూరణముచే దివ్యరూపము నొందించి రసజ్ఞుల కామెత లొసంగినారు. అది ద్వితీయ ముద్రణము నొందుటయే దాని ప్రచారమునకు తార్కాణము.

ఈ భామా కలాపమున సంప్రదాయము చక్కగా పాటింపబడినది. నారదుడు కృష్ణునకు పారిజాతము నొసంగుట, వినికిపట్టు, సొమ్ములపట్టు, శశిహేళ, మరుగోల, మందులపట్టు, రాయబారము, మూర్ఛపట్టు, మర్మాలపట్టు — అను భాగము లత్యంత రసభరితములుగా నున్నవి. భామా కలా

పము జీవాత్మ పరమాత్మల యైక్యానుసంధానమని పెద్దలందురు. శశిరేఖా పరిణయమును గూర్చిన వానికి గుణాలందలి ఉపాలంభ విధానమాంధ్రప్రబంధము లందలి విధానము ననుసరించుచు రమ్యముగా నున్నది. మందులపట్టు స్త్రీ స్వభావమున కను గుణముగా నున్నది. రసపాత్ర పోషణమందును, పదప్రయోగమునందును, భావప్రకటనము నందును సిద్ధేంద్రయోగి ప్రదర్శించిన నేర్పత్యంత శ్లాఘా పాత్రమై యొప్పుచున్నది.

నృత్యాచార్యులు చివర దాదినమ్మ వేషము అను భాగమును, సిద్ధేంద్ర యోగి కూచిపూడికి వచ్చి భామా కలాపము స్వరప్రూపులగు కొందరు బాలురకు నేర్పిన కథను చేర్చియుండిరి. దాదినమ్మ శీలము చక్కగా పోషింప బడినది. గీత పద్యరూపముననున్న సిద్ధేంద్రయోగి కథ హృదయావర్జక ముగా నున్నది. శ్రీ పార్వతీశముగారీ గ్రంథమును సిద్ధేంద్రయోగికే అంకితము చేయుట ఔచిత్య శోభితముగా నున్నది. కూచిపూడి పతాకచిత్ర మును, సిద్ధేంద్రయోగి బాలురకు నృత్యభంగిమలు నేర్పు చిత్రమును ఇందు చేర్చుట గ్రంథమున కుత్కర్ష నావహించుచున్నది. కూచిపూడి అగ్రహారో త్పత్తి కథ హృద్యముగా నున్నది. శ్రీ పార్వతీశముగారి కృషి ఫలించి సర్వానందదాయకమై విరాజిల్లుచున్నది. వారాయురారోగ్య భాగ్యములతో విలసిల్లుచు నృత్యకళ కితోధిక సేవ చేయుదురనియు, శ్రీకృష్ణపరమాత్మ వారి కట్టి అవకాశము కలిగింపవలె ననియు కోరుచున్నాను.

కళాప్రపూర్ణ

దివాకర్ల వేంకటావధాని.

ఎం. ఏ. (ఆనర్సు) పి. హెచ్. డి.

18/4 R. T. బరకత్పుర,
హైదరాబాదు-27,
27-7-82.

కూచిపూడి నృత్య సాంప్రదాయములో శ్రీ సిద్ధేంద్రకృత భామా కలాపము సుప్రసిద్ధమైనది.

మా పెద్దలు యీ భామా కలాపమును యేడు రాత్రులు ప్రదర్శించే వారట. మా వెంపటి వెంకటనారాయణ తాతగారు, వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రిగారు మూడు రాత్రులు ప్రదర్శించేవారట. ఇట్టి గ్రంథము పలురూప ములుగా విభజింపబడి వ్రాతప్రతి యౌటచే దరువులు, పద్యాలు, కందార్థాలు రెండు మూడు చరణములకు లుప్తమై అక్షరస్ఖాలిత్యము గలిగి మా తరము ప్రదర్శించుటకు వీలుగాని తరుణములో నృత్యాచార్యులు వేదాన్తమ్ పార్వ తీశమ్‌గారు శిథిలమైన యీ గ్రంథమును చేబట్టి ఆ యా సన్నివేశములకు తగినట్టుగా పూరించి ఒక రేయి ప్రదర్శనమునకు సరిపడునటుల సమకూర్చి తాను ఆడి పాడి వాగ్గేయకారుడై ఆచార్యుడై మా కెల్లరకు మార్గదర్శకు లైనారు.

భారతావనియందనేక ప్రదర్శనలిచ్చి పద్మశ్రీ మొదలగునవి పొందిన బిరుదములెల్ల శ్రీ పార్వతీశమ్‌గారు పూరించిన భామా కలాపము వల్లనేనని నా దృఢ విశ్వాసము.

శ్రీ సిద్ధేంద్రయోగి శ్రీ పార్వతీశ కవిగారికి ఆయురారోగ్య ఐశ్వ ర్యాల నిచ్చి కటాక్షించాలని కోరుచున్నాను.

ఇట్లు,

7-7-1982
కూచిపూడి

పద్మశ్రీ వేదాంతం సత్యనారాయణశర్మ.

వైస్ ప్రెసిడెంటు — ఆం. ప్ర. నృత్య అకాడమి.

# "ము ర ళీ ర వ ళి"

## ప్రయోగము -

'ఏవం నాట్యప్రయోగే బహుబహూ విహితం కర్మశాస్త్ర ప్రణీతం ।
న ప్రోక్తం యచ్చ లోకా దనుకృతి కరణం తచ్చకార్యం విధిజ్ఞైః॥'

— భరతశాస్త్రం.

శాస్త్రప్రణీతాలైన బహుకర్మ విశేషాలు ఈ నాట్యప్రయోగంలో సంగతంగా నున్నవి. లోకానుకార స్వరూపాలైనవి కొన్ని కొన్ని విరూపితాలైనవి. సర్వలోకానుకరణం శక్యనిరూపణం కాదు కావున, సర్వమిందు నిరూపితం కాలేదు. విధిజ్ఞులు, వివేకులైనవారు వానిని లోకానుసరణం చేయవచ్చు.

'లోకస్య చ స్వభావో యః సుఖ దుఃఖ విమిశ్రితః ।
నాట్యం తస్యానుకరణం చతుర్ధాఽభినయాత్మకమ్ ॥'

— నృత్త రత్నావళి.

సుఖ దుఃఖాలతో మిశ్రితమైనది లోకస్వభావం, నాట్యమనగా దానిననుకరించుట. అది నాలుగు విధాలైన అభినయాలతో ఏర్పడినది.

'నాట్యం నృత్తం నృత్యమితి మునిభిః పరికీర్తితం ।
నాట్యం తన్నాట కేష్వేవ యోజ్యం పూర్వకథాయుతమ్ ॥'

— అభినయ దర్పణం

నాట్యం, నృత్తం, నృత్యం అని మూడు భేదాలు. నాట్యమన్నది నాటకమందు పూర్వకథతో కూడినది. రస భావహీనమై తాళ లయాశ్రయమైనది నృత్తం — రస భావాభి వ్యక్తమైనది నృత్యం.

నృత్త నృత్యాలతో లోకావస్థానుకరణ పూర్వక ప్రయోగం నాట్యం. ఇది పూర్వరీతి. నేడు మారినది. దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధమైనవి, శాస్త్ర విహితమైనవి, కూచిపూడి నృత్యం. భరతనాట్యం, కథాకళి, ప్రసిద్ధాలు. వీనిలో భరతనాట్యం పూర్వరాజనర్తకి సంప్రదాయబద్ధం. నేటి భరతనాట్యం కచ్చేరీ నృత్యపద్ధతికి చేరినది. ఇది అలరింపు, జతిస్వరం, శబ్దం, వర్ణం, పదం, తిల్లాన, అనుక్రమంలో ఏర్పడియున్నది. ఇందు ఒకే నర్తకి నర్తించును.

కూచిపూడి నాట్యం లేక నృత్యం, భగవద్భక్తిపరంగా భాగవతమైంది. ఆనాడు దేశంలో ప్రచారంలోనున్న రాజనర్తకీ సంప్రదాయానుబద్ధమైన భరతనాట్యంలో. అభినయదర్పణానుసారంగా, ఇతః పూర్వమున్న మార్గ, దేశి, నృత్యరీతులను మలచి, నృత్య గేయ రస భావాభి వ్యంజక రూపకాభిరూపమైన ఒక ప్రత్యేక సంప్రదాయం! సిద్ధేంద్రయోగీశ్వరుల నవ్యసృష్టి! భగవల్లీలా విలాసం, చతుర్విధాభినయం, సంగీత సాహిత్యాలంకృతం, శృంగారరస సంభరితమైన ఒక దివ్యకళాఖండిక! దీని కిదే సాటి! సాటి నేటికి లేదు! ఏ నాటికి రాదు !

దీని ప్రయోక్తలందరు బ్రాహ్మణులు. పురుషులే: స్త్రీలుప్రయోక్తలు కారాదు నేడీ నియమం సడలింది. పూర్వం కొందరు విజయనగర పతనానంతరం రాజాశ్రయాపేక్షై, ఆనాడు ఉన్నత దశయందున్న నాయకరాజుల కడకు చేరి, తంజావూరు, మేలటూరుల యందు నివాసా లేర్పరచుకొన్నారు. నేటికీ మేలటూరు బ్రాహ్మణ భాగవతుల నృత్యపద్ధతి ఇదే-అచ్చట తెలుగు నాటకాలు, యక్షగానాలు, రాజాభీష్ట సిద్ధినొందిన వెన్నో! ఈ భామా కలాప, గొల్లకలాప పద్ధతులు ఆనాడు బ్రాహ్మణులేగాక, అన్యవర్ణముల వారును స్త్రీ పురుషులు నేర్చి ప్రదర్శించెడువారు. నేడును అట్టివారిని మనం అచ్చట, ఇచ్చట చూడవచ్చును. వారి ప్రయోక్త విధిలో స్వకీయం కల్పితాలెన్నో!

# 2

## కాలము –

సిద్ధేంద్రులు క్రీ. శ. 16 వ శతాబ్దిలోని నారాయణ తీర్థులవారి శిష్యుడనీ, ఆయన కూచిపూడి బ్రాహ్మణులకు నృత్యకళ నేర్పెననీ, 'పారిజాతం' లేక 'భామా కలాపం' అని దానికి పేరిడెననీ, డా॥ శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావుగారు తన నాట్యశాస్త్ర గ్రంథంలో తెల్పారు. మానుపల్లి రామకృష్ణ యతున కిది సరిపడుచున్నది. శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు నృత్తరత్నావళి పీఠికలో క్రీ. శ. 13 వ శతాబ్దికి చెందినవాడని అభిప్రాయపడినారు. ఈ గ్రంథ సంగ్రంథనకర్త శ్రీ వేదాన్తం పార్వతీశంగారు తమ కడనున్న సన్నదునుబట్టి క్రీ. శ. 1180, శాలివాహన శకం 1102 అనీ, 12 వ శతాబ్దంలో సిద్ధేంద్రుడు తన మేళవింపులో ప్రార్థనా గీతంగా "రాజగోపాలం – రాధాలోలం" అనే కీర్తన కూచిపూడిలోని రాజగోపాల స్వామిపై రచించాడనీ, సూచించారు. మరియు క్రీ శ. 1232 లో కూచిపూడి బ్రాహ్మణుల నృత్యం స్వయంగా చూచి మెచ్చి గోల్కొండ నవాబు (తానీషా?) కూచిపూడి అగ్రహారీకరించి దానమిచ్చి సన్నదు వ్రాయించి యిచ్చాడన్నారు. శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావుగారు–అబుల్ హసన్ కుతుబ్ షా గోల్కొండ నవాబు (క్రీ. శ. 1672–1687) క్రీ. శ. 1675 ప్రాంతంలో బ్రాహ్మణులకు కూచిపూడి దానమిచ్చెనని తెల్పారు. కంచర్ల గోపన్న (రామదాసు) ఆ కాలంలోనున్న గోల్కొండ నవాబు తానీషా, నారాయణతీర్థులు, కన్నడ సంకీర్తనకర్త పురందరదాసు, అభినవ భరతాచార్య 'స్వరమేళ కళానిధి' కర్త శ్రీరామామాత్యుడు 'రా[illegible]

కర్త శ్రీ సోమనాథ పండితుడు, ఇంచుమించు క్రీ శ. 15వ శతాబ్ది ఉత్త రార్థం, లేక 16వ శతాబ్దికి చెందినవారే — కావున సిద్ధేంద్రుడును అనాటి వాడు కావచ్చు. (సన్నదు పరిశీలింపవలెను)

సిద్ధేంద్రుల కాలం శ్రీ పార్వతీశం సూచించిన దానికీ, చారిత్రకుల నిర్ణయానికీ, పొత్తుకుదరలేదు. క్రీ. శ. 15వ శతాబ్దిలో గోదావరి నుండి కంచివరకు దండయాత్రచేసి హిందూదేవాలయాలు ధ్వంసంచేసి జనుల బాధించినవాడు గజినీమహమ్మదు కాదు. క్రీ. శ. 1480 లో గోల్కొండ నవాబు మహమ్మదు శాహ. అతనికి 'గాజీ' బిరుదు వుంది తిరుపతిని కొల్లకొట్టినవాడు, కూచిపూడి ఆలయాలు పాడుచేసినవాడు అతడే కావచ్చు.

## 3

### పద్ధతి —

ఇదియొక ప్రత్యేక పద్ధతి. మాచుపల్లి కైఫీయతునుబట్టి కూచిపూడి భాగవతులు విజయనగర ప్రభువుల ఎదుట ప్రయోగింపబడినది 'కేళిక' అని తెలియుచున్నది. అది సిద్ధేంద్రుల భామా కలాపం అనాటి పేరేమో! లేక మరొకటో!

తెలుగు దేశంలో గొల్లకలాపం-భామ వేషం-జలక్రీడ-పంతులు-ప ణీ వేషం-పగటి వేషాలు అను రీతులకు కూచిపూడి నృత్యపద్ధతి జనక స్థానమనీ, తమిళ, కన్నడ, కొంకణ దేశాలందున్న 'మోహినీ అట్టం' అను నృత్యపద్ధతికి దీనికి సామ్యముందనీ, నాట్యాచార్య శ్రీ దువ్వూరి జగన్నాథ రావుగారి అభిప్రాయం. అదెంతయు సత్యమే కావచ్చు.

భరతనాట్యంలో కథాఘట్ట ముండదు. ఇందు కథకు ప్రాధాన్యం. పరిపోషణకు, పరిపుష్టికి నృత్తపరికరం, అభినయ లీల వుండును. రాజన ర్తకి లోని లయసాంద్రత, భంగిమ సాంద్రత తగ్గించి దేశిపద్ధతిలోని చేర్పులు, మెఱుగులు చేర్చుకొని ఇద్దరు ముగ్గురు పాత్రలతో భగవల్లీలా విలాసంతో శృంగార రససిద్ధిలో శుభాంతమగుట కూచిపూడి నృత్యపద్ధతికి సంబంధం లేదు. ఇందు నృత్తనృత్యాభినయాలు సమానంగా పోషింపబడుతుంది' అను శ్రీ నటరాజు రామకృష్ణగారి అభిప్రాయంతో మనం ఏకీభవించాలి.

తెలుగు కవిత్వంలో ఆశు, మధుర, చిత్ర, విస్తరం, అనే చతుర్విధ కవితలున్నాయి. దేశి దృశ్య రచనలలోనివి యక్షగానాలు. 'ఆదట గంధర్వ యక్షవిద్యాధరాదులై పాత్రల నాడించువారు' అని పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో పేర్కొన్నాడు. వీధి నాటకాలు, బొమ్మలాటలు, తోలుబొమ్మలాటలు, బొమ్మలాటలు, దేశి నృత్యరూపకాలు.

యక్షగానాల్లో పదాలు, దరువులు, ఏలలు, ధవళాలు, మంగళహారతులు, శోభనాలు, జోలలు, జక్కులపదాలు, చందమామ పదాలు, అష్టకాలు, ఏక, ద్వి, త్రి, చతు, అష్టపములుండును. అప్పకవి చెప్పిన యక్షగాన లక్షణాన్నిబట్టి అందలి గేయరచన, రగడలు మార్చి — త్రిపుట — జంపె — ఏక - ఆటతాళాల కనువుగా నుండి, వెన్నెల — విరాళి - తుమ్మెద — గొబ్బి - కోవెల - చిలుక - అల్లోనేరెల్లో -సీస- కందార్థ - త్రిభంగి_ మంజరు లుండవలెనట! యక్షగాన ప్రబంధాలను శ్రీనాథాది కవులు ప్రశంసించారు

కూచిపూడి భాగవతంలోన్ని కొన్ని యక్షగాన లక్షణాలున్నందున వాని ననుసరించి ఒక ప్రత్యేక రచనాప్రక్రియ ఈ భాగవత కథా మేళనం!

దీన్నిగూర్చి ప్రభుత్వ అకాడమీలలోని నృత్యవేత్తలైన పెద్దలకే తెలియకుండుట విచారకరము! ఇది అశాస్త్రీయమని వారి భావమేమో! చూడండి- 'INDIAN DANCING By Ram Gopal కేంద్రసంగీత నాటక అకాడమీ ప్రచురణ : P-78.

నేడీ లలితకళలపై బ్రతుకుట దుర్లభం. ఆనందానికి అభ్యసించాలి. భుక్తిలేక రక్తితో ముక్తి కోరటానికి సాధ్యమా? అందుకే ఈ విద్య వెనక బడుతూంది.

## 4

### జడపట్టు —

ఏ నృత్యపద్ధతియందు లేని 'జడపట్టు' లేక 'జటాకలాపం' విధానం కూచిపూడి నృత్యపద్ధతిలోని ప్రత్యేకత. భామాకలాపంలో సత్యభామ — 'రేమ లెల్లరు చూడ జడతో — వేమరు నిను గొట్టకుంటే — భామనా ?' — అను కథాంశంలోని ధీరోక్తికాదు. అది ఒక నియమం! సభాసదులకు అది సవాల్ !

జడ జంఘలు తాకునట్లుండ వలెనట! మొగలిరేకులు, అర్ధచంద్ర వంకల వరుసలతో రత్నాలంకృత్యమై, ముత్యాలసరులు జార, పూలమాలికల మెలికలతో, జడాగ్రం బంగరు పట్టుకుచ్చులతో నుండవలెనట! సర్పాకృతి శిరోభూషణం (నాగరము) వుండవలెను

భామ (నాయిక) రంగస్థల ప్రవేశానికి ముందు ఈ జడపట్టు విధానం ప్రదర్శింపవలె - పూర్వరంగంలో తాళలయానుబద్ధమైన నృత్తం ప్రయోగిస్తూ, జడను తెరపై జిమ్మివేయవలెను తనకు (నటునికి) సకలశాస్త్ర పాండిత్యమున్నదనీ, సభలో విద్వాంసులున్న తనను పరీక్షింపవచ్చుననీ

సూచించుట - విద్వాంసులు పరీక్షించిన మీదట పాత్రధారి ఓడిపోయినచో, ఆ జడ కత్తిరించుటయో, అపజయ పత్రిక నిచ్చుటయో చేయవలెను. నేడు అది లేదు.

అది ఆనాటి నృత్త్యాచార్యులైన మహర్షి పుంగవుల కఠోరనియమం. అందువల్ల అభ్యాసకులన్నిట విద్యావంతులయ్యేవారు. అర్ధచదువు చదివి నిరర్థకులై అనర్థం తెచ్చేవారుకారు. ఆనాటి నృత్యవిద్యాభ్యాసకు లన్నిటకు సమర్థులు.

శ్రీ నటరాజ రామకృష్ణగారు 'జడపట్టు' నృత్యఖండిక వ్రాసి తమ శిష్యులచే ప్రదర్శింప జేస్తున్నారు.

## 5

## లక్షణము.

'అవస్థానుకృతి ర్నాట్యం రూపం దృశత యోచ్యతే,
రూపకం తత్సమారోపాత్ దశ ధైవ రసాశ్రయమ్ ॥'

అవస్థను అనుకరించునది నాట్యం — అది చూడదగినది కావున రూపము. రూపమారోపింపబడుటచే రూపకం రసాశ్రయమైన అది పది విధాలు.

ఆ దశవిధ రూపకాల్లో వీధి కను రూపమై ఉపరూపకమైన 'శ్రీగదితం' వలె వెలయు ఈ భాగవత నృత్యం, ఏకాంకం. పారిజాతాపహరణ వృత్తాంతం, సత్యభామ గర్వనిర్వాపణం, సత్యాకృష్ణుల ప్రణయ లీలా విలాసం, ప్రధానంగా గల నృత్యరూపకం.

కైశికీ వృత్తిలో శృంగారరసయుక్తమై ఉత్తమ, మధ్యమ, అధమ ప్రకృతుల ముచ్వురితో ప్రయుక్తం. చతుర్విధాభినయ పూర్వకమైన కల్పితేతివృత్తం గల అభిరూపకం.

ఇందలి నాయిక సత్యభామ: విరహోత్కంఠిత, అనగా తనకడకు ప్రియుడు రాకున్న అతనికై వగచే బాధనొందునది. నాయకుడు ఉత్తముడు

కృష్ణుడు. ఇందు విప్రలంబ శృంగారం ఫలావాప్తి నొందినది. నవ్య ప్రక్రియారూపకమైన ఈ భామా కలాపమునకు నారాయణతీర్థ విరచితమైన శ్రీకృష్ణ లీలాతరంగిణి మార్గదర్శకమనీ, దానిచే ప్రభావితుడైన సిద్ధేంద్రుడు ఈ అభినయాత్మక రచన చేసి యుండుననీ నా భావము. అది మార్గము — ఇది దేశి —

# 6

## పరిశ్రమ -

సిద్ధేంద్రయోగీశ్వరుల ఈ భామా కలాప పరిపూర్ణ రచన శిథిల గ్రంథగతమైన అట నట లోపించి యుండుటచే పరంపర సంప్రదాయము ననుష్ఠించు నృత్యాచార్యులు శ్రీ వేదాంతం పార్వతీశంగారు జాగ్రత్తగా దానిని పరిశీలించి లోపమున్నచోట సంస్కరించి, పూరించి, స్వయంగా ఆడుతూ పాడుతూ పరిష్కరించినారు.

సిద్ధేంద్రుల మూలరచనమేదో! పార్వతీశంగారి రచన మేదో వారు తెలుసవలసిందే—పాఠకుల కంతుబట్టదు ఇంత చక్కగ పూరించడం అంద రికీ సాధ్యం కాదు పార్వతీశంగారు 'నేను కవిని కాను' అంటూ చక్కని కవిత్వం చెప్పారు. అది వారి వినయగుణ సౌశీల్యం! వారి వాక్కుమాల్లో పద పద్యకవితామధువుంది. రుచి చూడండి!

సందర్భశుద్ధిగా నందితిమ్మన, ముద్దుపళని, క్షేత్రయ్యలు కలిసి నృత్య మాడారేమో! అన్నట్లు వీరి రచనలో చేరారు. ఆకవి వరేణ్యులందు ఈకవికి గల అభిమానం, భక్తిప్రపత్తుల కది నిదర్శనం.

శ్రీ పార్వతీశంగారు ఈ ద్వితీయ ముద్రణలో పూర్వముద్రణము నుండి కొన్ని మార్పులు చేసినారు. కొన్ని పద్యాలు పాటలు తొలగించారు.

విపరీత పరిహాసమునకన్న సున్నిత హాస్యమున్న బాగని తలంచారు. వక్రోక్తితోనున్న హాస్యమతి సుందరము, సున్నితము. లోకోత్తర చమత్కారివై చిత్రీసిద్ధి వక్రోక్తి సిద్ధాంతమునకు బీజం – 'లోకోత్తర చమత్కారకారి వైచిత్ర్య సిద్ధయే – కావ్యస్యాయమలంకారః, కోఽప్యపూర్వో విధీయతే' అని గదా పెద్దలవాక్కు!

తొలిముద్రణలో పాటలకు మృదంగజతుల కొలుపుకూర్చియున్నారు. ఈ ముద్రణంలో వానిని తొలగించారు. ప్రయోక్త లయవీక్షము ననుసరించి వానిని కూర్చవచ్చుననియా? ఏమైన భాగవత మేళనములోని కీర్తనలకు మృదంగజతుల కొలుపు జీవం గదా!

కూచిపూడిలోని బ్రహ్మశ్రీ వేదాన్తం లక్ష్మీనారాయణశాస్త్రిగారు వాల ప్రసిద్ధి గలవారు వారిని ముప్పయి యేండ్ల క్రితం నేను భద్రాచలంలో స్వామి సన్నిధిని దర్శించాను. వేదాన్తం సత్యనారాయణశర్మ, రాఘవయ్య సోదరులు మరెందరో విశేషపరిశ్రమచేస్తూ ఈ దివ్యనృత్య సంప్రదాయాన్ని పోషిస్తున్నారు.

## 7

## ఆకాంక్ష -

నారదాగమనం! విసికిపట్టులోని దూతికా సందేశంపు గుట్టు! నాయిక ఆవేదన, అనురాగాంతరంలోని అనుతాపంపు పుట్టు! సొమ్ముల పట్టులోని కనుకట్టు! సర్వస్వమర్పించి నాయకుని రప్పించుకొనుపట్టు! విప్రలంభశృంగారపు శశిహేల! మరుగోల! చమత్కార సంభాషణలీల! మందులపట్టున వశీకరణ ఔషధాల గుట్టు! రాయబారం, మూర్ఛపట్టుల రట్టు! మర్మాలపట్టున జడపట్టు, అభిమానంపు బెట్టు!

ఈ సొగసులు నృత్యరంగాన చూడవలసినదే! తెలిసికొనవలసిదే! అభ్యసించవలసినదే! అభినయించవలసినదే!

'దేశే దేశే జనానాం యద్రుచ్యా హృదయ రంజకం।
గానం చ వాదనం నృత్యం తద్దే శీత్యభిధీయతే॥'
— సంగీత రత్నాకరం.

ఈ ముద్రణలో ఈ భామాకలాపం గాక మరి నాల్గు రచనలున్నాయి.

వాదినమ్మ వేషము :— ఇది నీచపాత్రా ప్రయోజ్యము. శృంగారరస ప్రధానమైన నృత్యఖండిక – ఏకాంకము – దూర్త చరితము – చోర ద్యూత కర్ములు దూర్తులు.

కూచిపూడి పతాకము :— శ్రీ పార్వతీశంగారు తమ నృత్య కళామ తల్లికొక పతాక మేర్పరచి కీర్తన రచించి జోతలిడినారు. వీరి కళాభారతికి, భక్తికి ఇది కీర్తి పతాకం!

కూచిపూడి :— ఈ రచన కూచిపూడి గ్రామానికి ప్రజలకు అంకితం-కూచిపూడి నృత్యావతార వృత్తాంతం నృత్యమహిమాధి వర్ణనం తెల్పు చిన్న పద్యకృతి.

అగ్రహారోత్పత్తి :— కూచిపూడి అగ్రహారం బ్రాహ్మణుల కెలా వచ్చింది తెల్పు రచన – పద్యం.

శ్రీ పార్వతీశంగారు శ్రమించి తిరుమల తిరుపతి దేవస్థానమువారి ద్రవ్యసహాయంతో ఈ నృత్యకళాభారతి నర్చించి వెలుగు చూపి తెలుగువారి జోహారు లందుకొన్నారు. ఒందు రెండు రచనా దోషములున్నవి. 'ప్రమాదో ధీమతా మపి' అనుకొందము – అట నట అచ్చు జారుపాటు కలవు, మన్నించి దిద్దుకొందము. మచ్చగలదని చంద్రుని చూడకుందుమా!

వీరి అముద్రిత రచనలు మన కందిమ్మని శ్రీ వేంకటేశ్వరుని ప్రార్థింతును.

కూచిపూడి రామలింగేశ్వరుని సన్నిధిని మువ్వల సవ్వడుల్లో రాజ గోపాలుని '**మురళీరవళి**' నిత్యనూతనంగా వినబడుచున్నది. విని, కన్నవారిదే భాగ్యం! జీవితమే ధన్యం! శుభమస్తు!

'అంబరసీమఁ దారలు జటాటవి మల్లె విరుల్ భుజాంత రా
ళంబున హార సంతతు లిలాస్థలి బూలవర్షముల్ ప్రసూ
నంబులు సత్కృతాంజలి గనందగి మౌక్తిక తుల్యమౌళి గం
గాంబు కణంబు లుట్టిపడ నాడెడు శంభుడు మిమ్ము బ్రోవుతన్ ॥'

— 'ఆంధ్ర భరతం.'

అల సిద్ధేంద్రమునీంద్ర భాగవత రూపాత్మైక కేళీ కళా
వళి శృంగార రసానుభావమున నీ భామా కలాపమ్ము త
న్నలరింపన్ మదిమెచ్చు మాధవుడు నృత్త్యాచార్య, వేదాంత స
త్కులజున్, సత్కవిఁ, బార్వతీశు, మహిమోద్యూతిన్
దయనోమ్మతన్ !

లలిత కళానిధి - విద్వాన్

మైవంపాటి
వేంకటసుబ్రహ్మణ్యము.

బుదుగుంటపల్లె,
కోడూరు (R. S.)
16-7-1982.

1953-8-23 న గుంటూరు ఏకాదండయ్యపంతులుగారి హాలులో జరిగిన ప్రదర్శనలో —



భాగవతుల లక్ష్మీనరసింహం — వేదాంతం పార్వతీశమ్



## నా మాట

గురుదేవులు దివాకర్ల వేంకటావధానిగారికి, శ్రీ మైనంపాటి వేంకట సుబ్రహ్మణ్యము గారికి, శ్రీ వేదాంతం సత్యనారాయణశర్మ గారికి, ఆర్థిక సహాయ్యమొనరించన తిరుమల తిరుపతి దేవస్థానము వారికి కృతజ్ఞుడను.

1954 ఫిబ్రవరిలో గుంటూరులో హైకోర్టు ప్రారంభోత్సవము- శ్రీ అనంతశయనం అయ్యంగారి సరళ సంస్కృతబోధనా మీమాంస మహా

సభలందు ఏకాదండయ్యపంతులుగారి హాలులో – శ్రీ విస్సా అప్పారావు గారిని కలసికొంటిని. వారు సిద్ధేంద్రుడు 16 వ శతాబ్దము వాడని చెప్పినారు. అందులకు నేను - మా సిద్ధేంద్రుడు 12 వ శతాబ్దము వాడనియు, తమరు కూచిపూడి వచ్చినచో తగిన ఆధారములు, సనదు వగైరాల చూపింతునని తెల్పియున్నాను. కాని వారు కూచిపూడిరాలేదు. తదాది కూచిపూడిని గురించి వ్రాయు పెద్దలు—అందు శ్రీ రాళ్ళబండి అనంతకృష్ణశర్మగారు సిద్ధేంద్రుడు 13 వ శతాబ్దము వాడనియు, కొందరు 15 - 16 శతాబ్దమనియు వ్రాయు చుండిరి. నేను ప్రతివారికిని మా సిద్ధేంద్రుడు 12 వ శతాబ్దము వాడనియు తట సమైన వారికి ముఖతాను, జాబుల రూపముగాను వ్రాసియుంటిని. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ వారికి కూడా కవరు వ్రాసియుంటిని. ఆధార ములను సేకరించుటకు కూచిపూడికి యెవ్వరునూ రాలేదు.

పెద్దలకును, కూచిపూడిని గురించి పరిశోధనలను జరుపు యువకు లకును మనవి చేయుచున్నాను. తామెల్లరు కూచిపూడికి దయచేయండి—ఈ సనదు నకలు వ్రాయించినవారు యేలేశ్వరపు కనకదుర్గయ్యగారు అనియున్న అతి పురాతనమైయున్న సనదును శ్రీ సిద్ధేంద్ర కళాక్షేత్రములో మందస మున భద్రపరచియుంచితిమి. స్వయముగా వచ్చి చూచి, చదివి నిర్ణయము లను లోకమున కందివ్వండి. మా సిద్ధేంద్రుడు నారాయణతీర్థులవారి శిష్యుడు కాడు. అగ్రహారోత్పత్తి సనదులో శాలివాహన శకం ౧౧౫౪ ఫసలీ యని యున్నది. అనగా క్రీ॥ శ॥ 1232 సంవత్సరము అంకెలను, అందలి వాడిన పదములను సనదులో నున్నరీతినే వ్రాసియుంటిని.

సిద్ధేంద్రయోగి – శిక్షితే నృత్యకేళి

శేముషీ – విశ్వఖ్యాతీ – కూచిపూడీ పరాతు ॥అంబా॥

— మీ

పార్వతీశుడు.

# మనవి

దివిసీమ దివ్యసీమ. అందు కూచిపూడి నృత్యకళా సంస్థానము. తొలుత యీ గ్రామము కుచేలపురి. వానప్రస్థాశ్రమము. ఇంవలి ప్రథమ పురుషుడు కుచేలుడు. ఏ యుగమైననూ యీ భూమండలముననే గదా. పారంపర్యా కుచేలుడైననూ కావచ్చు. మహమ్మదీయ పాలనములో-యీ గ్రామము కూచిపూడిగా వ్యవహరింపబడినది. కుచేలుడు—రామేశ్వర స్వామి—రాజగోపాలస్వామి యను పేరులతో-శివకేశవులను వేర్వేర ప్రతిష్ఠించి—యజనయాజన షట్కర్మానుష్ఠాన నిరతులగు బ్రాహ్మణ కుటుంబములతో-దివ్యసీమగా-ఆశ్రమ ధర్మముల నిర్వర్తించెడివాడు—

ఇటులుండ శాలివాహన శకం ౧౧౦౨ ఫసలీ — క్రీస్తుశకం 1180వ సంవత్సర ప్రాంతమున సిద్ధేంద్రుడను యోగిపుంగవుడు విచ్చేసినాడు. సోమయాజులగారింటికి భిక్షకు వెళ్ళినాడు. సోమయాజులుగారు అర్ఘ్యమిచ్చినాడు. స్వీకరించనన్నాడు స్వామి. కారణం—నా రచన భామాకలాపమును మీరు ఆడిపాడాలన్నాడు కర్మిష్టులం — నాటకకళ మాకు వద్దు బాబోయన్నాడు సోమయాజి. భిక్ష గైకొననన్నాడు సిద్ధేంద్రుడు. బ్రతిమాలినారు శపిస్తానన్నాడు. భయపడి నేర్పండి ఆడుతమన్నారు. సంతోషముతో కడుపార భుజించి - నవమన్మథులు—చికిలికళారులు—యిద్దరు వటువులకు భామ-కృష్ణులుగా ఆటపాటలు నేర్పినాడు. సోమయాజులుగారికి సూత్రధారిత్వము నేర్పినాడు. నాటి శృంగేరి శంకరాచార్య భగవత్పాదుల పీఠమునకేగి భామాకలాప ప్రదర్శన చేయించినాడు.

భగవత్పాదులు యియ్యది నాట్యవేదమనియు, భాగవత కళానుష్ఠానమున భాగవతులుగా విలసిల్లుడని తామ్రశాసనమిచ్చినాడు. ఇంకేమి యెందరో పీఠాధిపతుల మన్నన లందినారు. యజ్ఞయాగాది క్రతువులతో భామాకలాపము కూడా భుక్తి ముక్తిదాయకమైనది.

ఇటులుండ మహమ్మదీయ సార్వభౌముడు నాటి తానీషా బందరు కోటకు (యీ బందరు నేడు మచిలీపట్టణముగా వ్యవహరింపబడుచున్నది) రాచకీయమునకై సపరివారముగా తరలివచ్చి, కూచిపూడి భూములందు దేరాలు వేసుకొని రేయి సుఖనిద్ర నుండెను. నాటి రేయి శుక్రవారము. దేవాలయము ముందు భామాకలాప ప్రదర్శన జరుగుచున్నది. తానీషా నిద్రలోయున్నాడు. కలలో యీ భామాకృష్ణుల ఆటపాటలు మత్తుగొలుపు తున్నాయి. మేల్కాంచినాడు. వినబడుచునేయున్నవి. పరివారముతో బయలు దేరినాడు. దేవాలయము ముందు తన కలలో కాన్పించిన బాలురే వేషాలతో ఆడుతున్నారు. మహదానందమంది నృత్యకళ ఆచంద్రతారార్కము విల సిల్లగలందులకు శాలివాహన శకం ౧౧౫౪ ఫసలీ క్రీస్తుశకం 1232 వ సంవ త్సరములో కూచిపూడిని అగ్రహారముగా తానీషా సనదు నిచ్చినాడు. సామంతులగు బెజవాడ జమీందారులగు కలవకొలను బుచ్చన్నారావు యీ తిమ్మన్నారావుగారలను కూచిపూడి యెస్టేటుకు రక్షణ శాఖాధిపతులుగా నియ మించినాడు.

భాగవతుల లింగన్న, యీగోపాలు, పెద్దిభొట్ల గుర్లింగం, వేదాంతం రామేశంగార్లకు కూచిపూడి అగ్రహారము జమీందారీ యెస్టేటుగా స్థిరపరచి శాశ్వితముగా నిచ్చుచూ, శ్రోత్రియ ధర్మశాసన పత్రిక సనదు నిచ్చినాడు. వీరలకు కూచిపూడి ప్రొప్రయిటర్లుగా జబ్దతుల్ ఆగ్రాఫు బాఫీయత్, తాషంద్ అను బిరుదులిచ్చినాడు. నాటినుండి నృత్యకళా సంస్థాన జమీందారులుగా పేరొందినాము. తదుపరి పరంపరా తొమ్మిదిమంది గ్రామప్రొప్రయిటర్లుగా నియమితులైనారు.

వీరలు మొగలాయీ ప్రభుత్వమువారికి రు. 229-4-0 (రెండు వందల యిరవై తొమ్మిది రూపాయలు పావలా) శిస్తుగట్టుచుండెడివారు. ఈ గ్రామమునకు సంబంధించిన భూమి సర్వేప్రకారము 636 యకరముల

34 సెంట్లు. ఇందులో మైనరు యీనాముల విస్తీర్ణము 14 యకరముల 10 సెంట్లు. అందరి యుపయోగములకు యుపయోగించు భూమి 4 యకరముల 47 సెంట్లు. (దీనిని గోష్ఠమందురు. ఇప్పుడు శ్రీ సిద్ధేంద్ర కళాక్షేత్రము భవనములతో విరాజిల్లుచున్నది.) పోరంబోకులు చెరువులు మొత్తము 81 యకరముల 38 సెంట్లు. మిగిలిన భూమి 536 య॥ల 39 సెంట్లు. యీ మొత్తము భూమిలో నాడు వ్యవసాయముచేయు భూమి 239 య॥ల 33 సెంట్లు. మిగతా భూమియంతయూ సేద్యమునకు వీలుగాక బీడుగాయుండెడిది.

కొలది కాలములో అగ్రహారీకులలో కలత లేర్పడుటచే 134 మంది అగ్రహారము స్వంతపట్టాదారులుగా విభజింపబడిరి. పర్యవసానముగా 3229 నెంబరు పట్టా యివ్వబడెను.

1755—56 సంవత్సర ప్రాంతమున ఫ్రెంచివారు కూచిపూడి అగ్రహారమును తమ యేలుబడిక్రింద జేర్చుకొనినారు. ఫ్రెంచిసర్కారు తరఫున వకాల్తు రావుమద్దాలి రెడ్డినాయుడు కూచిపూడి మా స్వాధీనములోనికి వచ్చినది గనుక మేముకూడా దాని పన్నును యెప్పటివలెనే పన్నెండు వరహాలకు స్థిరపరచినామనియు, భాగవతుల యెగ్గెన్న, యీ నరసన్నగార్లకు కూచిపూడి అగ్రహారము శ్రోత్రయిటర్లు అధికారమిచ్చుచూ, పట్టానొసగి మీరుమమ్ముల నాశీర్వదించుచూ అగ్రహారము రాబడిని అనుభవించుటకు నియమించుచున్నామని సనదు విచ్చినారు. ఈ సనదుపత్రము అమలు జరిగినటుల కాన్పించదు.

1761 వ సంవత్సర ప్రాంతమున యీస్టిండియా కంపెనీవారి ఉత్తర సర్కారుల గురించిన విషయములలో కంపెనీవారి తరఫున విశేషాధికారములు కలిగి దుబాషులుగానున్న మొసలికంటి కామోజీపంతులు, కాద్రేగుల జోగిపంతులు, అమరేశు తిరుపతిరాయనంగార్ల వల్ల పసుమర్తి రాయలు, వేదాంతం భగవానులు, భాగవతుల లింగన్నగార్లను కూచిపూడి శ్రోత్రయిటర్లుగా నియమించినారు. శిస్తు అరవై వరహాలకు స్థిరపరచినారు.

1808 వ సంవత్సరములో కూచిపూడి యెస్టేటుకు సంబంధించిన సమస్తమైన సనదులను, హక్కుపట్టాలను ప్రొప్రయిటర్ల వద్దనుండి తెప్పించి కలెక్టర్ డేడబుల్ కచేరీలో రిజిష్టరు చేయబడియుండెను.

15 వ శతాబ్దములో గజనీమహమ్మద్ మహమ్మదీయుల దండయాత్రలో రామేశ్వరస్వామివారి దేవాలయము, రాజగోపాలస్వామివారి దేవాలయములను కూల్చద్రోసి రాజగోపాలస్వామివారి విగ్రహమును భూస్థాపితము జేసి, గంగానమ్మ తలను చెక్కలు జేసినారు. నాడు యీ దేవాలయములు పాటిమట్టి మిద్దెదిబ్బలతో యుండెడివి. మహమ్మదీయుల దండయాత్ర యలజడి తగ్గిన తదుపరి నాటి గ్రామప్రొప్రయిటర్లు శివాలయము మట్టిపెళ్లలు తొలగించి తమ పీదరికమునకు సూచనగా పాటిమట్టితో మిద్దె నేర్పరచి స్వామి లింగమునకు సంప్రోక్షణ మొనరించి రామలింగేశ్వరస్వామి యని నామకరణము చేసినారు. గ్రామములో కొందరు మా వంశీకుడు కుచేలుడు రామేశ్వరస్వామి యని ప్రతిష్ఠించియున్నాడు కావున రామేశుడనియే పిలువవలెనని పట్టుపట్టినారు. చేయునదిలేక ముసలివారు ముందుకువచ్చి రామేశ్వరస్వామివారనే రామలింగేశ్వరస్వామిగా పిలువుడని స్థిరీకరించినారు. నాటినుండి శివాలయము రామేశ్వరస్వామివారనే రామలింగేశ్వరస్వామివారి దేవస్థానముగా యేర్పడినది.

ఇక రాజగోపాలుడు భూస్థాపితమయినాడు గదా, ముక్కచెక్కలై యుండునని తలంచి దేవాలయమును పునరుద్ధరించలేక పోయినారు. 12 వ శతాబ్దములో సిద్ధేంద్రుడు మేళవింపులో ప్రార్థనాగీతముగా "రాజగోపాలం-రాధాలోలం – రాజగోపాలం భజే – మమజీవనం – రాధాలోలం భజే॥" యను కీర్తన రచించినాడు. 19 వ శతాబ్దములో యీ రాజగోపాలస్వామి వారి గుడియున్న ప్రదేశములో పాటిమట్టి తవ్వుచుండగా కొద్ది శిథిలావస్థలో నున్న రాజగోపాల విగ్రహం, ముఖమండపమున కుపకరించు రెండు కొండ రాతి స్థంభములు - రాళ్ళు బయటపడినవి. 1961 నుండి యీ రాజగోపాల

స్వామి శ్రీ సిద్ధేంద్ర కళాక్షేత్రములో నాట్యాచార్యుడను కొనుడని వేదిక నలంకరించి విద్యార్థుల నృత్యతరగతుల తిలకించుచున్నాడు.

నాడు సిద్ధేంద్రుడు భామాకలాపమును తాళపత్రములందు లిఖించి మాకు యిచ్చినాడు. నోటిపాఠములతో నానాటికి దర్వులందు యొకటి రెండు పాదములవరకు పద్యము కందార్థములందు, రెండు మూడు పాదములవరకూ దిగజారి అక్షరవంక్తి స్ఖాలిత్యములు గలిగి ప్రదర్శనమునకు తీరనిలోటుగా యుండెడిది. నేను నృత్యకారుడను. తపన పుక్కిలింత లిడుచుండెడిది. ఏలేశ్వరాచారిగారు అక్షరకూర్పు నేర్పినారు. 9-2-1954 తేదీ రాత్రి ఒక వృద్ధుడు కలలో కాన్పించి పూరించి రాయమన్నాడు. కలంపట్టితిని ఆడుతూ పాడుతూ కావలసిన ఘట్టములందెల్లడ పూరించితిని. చేతకాని సమయము లందు ముక్కుతిమ్మన్న మొదలగువారల జేర్చుకొంటిని. ఎటులనైతే నేమి రచన పూర్తిజేసి — "బంగరు పూవుల పూజసేతు - కర్పూర హారతుల కైదండ లిడుదు"-అన్నా. మళ్ళీ తాతయ్య కలలోనికి వచ్చి నా అరచేతిని ముద్దుపెట్టుకున్నాడు.

మరునాడే మా బందా కనకలింగేశ్వరరావుగారు, మా వేదాంతం సత్యనారాయణశర్మగారికి నేర్పించినాడు. కేస్కర్ ముందు ఆడించినాడు. ఆల్ యిండియా రేడియో విజయవాడ కేంద్రమువారిచేత రికార్డు చేయించి నాడు. ప్రచారము వినుచునేయున్నారు గదా! హైదరాబాదు సంగీత నాటక అకాడమీ సెమినారులో భామాకలాపం ఆడించినాడు. నానాదేశ కళాకారులం కూచిపూడే ప్రథమ మన్నారు. నేను నిమిత్తమాత్రుడను. దీనినే అందరూ ఆడిపాడుతున్నారు.

పూర్వమునుండి యుండిన హాస్యమును చాలావరకు తగ్గించి అవసర మయినంత వరకే ప్రచురించితిని. కారణం—నేటి తరమునకు రుచించని కారణమున హాస్యకారుని పాత్ర స్వచ్ఛమైన వైదిక బ్రాహ్మణ పండితుడుగా యుండాలి. ఇది మా కూచిపూడి సాంప్రదాయము. భరతుడు—హాస్య

కారుడు అతని చేతికఱ్ఱ కుంటలకమనినాడు. "పరిహాస భాషిణీం త్యజంతి" ఆడవారికి పరిహాస భాషణము తగదంటారు. భామాకలాపం, జీవాత్మ పరమాత్మ ఐక్యానుసంధానమంటారు మా పెద్దలు. అగ్నిహోత్రుడు, గర్గుడు యదువంశమునకు గురువులు. కర్తవ్యతా బోధకుడు గురుడు. నృత్యవర్గములో సూత్రధారి యందురు. ఒకరు యేదో మనతో చెప్పుదురు. దాన్ని వక్రముగా, ఛలోక్తిగా సమాధానమిస్తే అసలు వారి మనోభావమును వివరించి తెల్పుదురు. అందుకే యీ హాస్యకారుని పాత్ర. ఇది నాటక రంగము గదా ! —

సీ॥ ఆదిశంకరు కాలమందు శ్రీసిద్ధేంద్రు
రచన యీ భామాకలాప మెల్ల
కూచిపూడి బుధుల కోయిల కంఠముల్
విని నేర్పె నీ నృత్యవిద్య నపుడు
ద్వాదశ శతవర్ష తాళపత్రపు లిపి
నోటి పాఠాలతో నూటిదప్పె
సిద్ధేంద్రు డొకనాడు నిద్దురన్ లేపి పూ
రించు మనుచు ప్రబోధించి చనియె.

గీ॥ ఔర నన్నేదొ శివ మొక్క డావహించ
స్వామికిని మ్రొక్కి పూరించి జయము గంటి
తప్పులన్ ద్రోసి గ్రహియింపు డొప్పులున్న
ప్రథిత గుణులార కవిసార్వభౌములార॥

ఇట్లు,
వేదాన్తమ్ పార్వతీశమ్.
నృత్యాచార్య.

# కూచిపూడి

# భామాకలాపము

గీ॥ శ్రీ సతీలాస్య గౌరవ శ్రీల జూచి
తనకునై తానె యుప్పొంగి తాండవించు
శివుడు మా పతి నటరాజు సిద్ధమూర్తి
యిచ్చుగావుత సిరులను నిపుడు-నెపుడు॥

శ్లో॥ సిద్ధేంద్రయోగి సంసేవ్యం
భామాకలాప నాయకం
నమామి రాజగోపాలం
కూచిపూడీ నివాసినం॥

-: మేళవింపు :-

శ్లో॥ అగజానన పద్మార్కం - గజానన మహర్నిశం
అనేక దంతం భక్తానా - మేకదంత ముపాస్మహే॥

-: శ్రజాతి త్రిపుట — నాటరాగము :-

1. విఘ్నరాజాయతే నమో
వేదవేద్యాయతే నమో
వక్రతుండాయతే నమో
పార్వతీ తనయాయ నమో నమో ॥ విఘ్న ॥

2. లంబోదరాయతే నమో
రజితాద్రి నిలయాయ నమో నమో
సామవేద గీతాయతే నమో
స్కంధపూర్వజ నమో నమో ॥ విఘ్న ॥

3. మోదకప్రియాయతే నమో
మూషక వాహనాయ నమో నమో
కుబ్జరూపాయతే నమో
కోటిరవిభాసాయతే నమో నమో ॥ విఘ్న ॥

4. ధూమకేతవే నమో
దోషరహితాయ నమో నమో
హేరంబాయతే నమో
ఈశ్వర తనయాయ నమో నమో ॥ విఘ్న ॥

—: మో హ న - మి శ్ర చా పు:-

1. అంబా! పరాకు - దేవీ పరాకు
మమ్మేలు మా శారదాంబా పరాకు ॥ అంబా ॥

2. వాణీ! పరాకు — గీర్వాణీ పరాకు
వాణీ! చక్కని — నీలవేణీ పరాకు ॥ అంబా ॥

3. సరసిజలోచను చెల్లెలవై మమ్ము
కరుణించు బంగారు బొమ్మా పరాకు ॥ అంబా ॥

4. ఓంకారి కౌమారి వారాహి శార్వాణి
శాంకరీ వాలోకశక్తి! పరాకు ॥ అంబా ॥

5. తకిట తాం తాం తాతెయ్యా యనుచును
తాండవమాడేటి తరుణీ పరాకు ॥ అంబా ॥

6. చెలపిళ్ళ రోగములు - చెలగు సాంద్రముల
చేరి ఛడాండేటి శక్తి పరాకు ॥ అంబా ॥

7. కనకామ్ర జలధిలో - జలకము లాడగ
కులుకుచు తిరిగేటి కలికీ పరాకు ॥ అంబా ॥

8. కుంభికుంభయున - కుంభపయోధరి
కంబుకంధరి మా గౌరీ పరాకు ॥ అంబా ॥

9. ఆరువీధుల నడుమ – ఆగడముగ
అలంపూరులో వెలసిన – జోగులాంబా పరాకు ॥ అంబా ॥
10. అప్పనంబుగ – వడపప్పు పానకములు
గొప్పగా దెచ్చితి – ఒప్పులకుప్పా పరాకు ॥ అంబా ॥
11. మూడు మూర్తులకు మూలమైన
కూచిపూడిలో వెలసిన బాలా పరాకు ॥ అంబా ॥
12. ముగ్గురమ్మల బొమ్మ – కూచిపూడి కొమ్మ
నృత్యవాంఛ్మీ – బాలమ్మా పరాకు ॥ అంబా ॥
13. ఈ రీతిగా మిమ్ము కోరినవారిని
కావవే కనకదుర్గా పరాకు ॥ అంబా ॥

—: నా ట - ఝం పె :—

జయ రాజగోపాల – జయవార్ధి గంభీర
జయ నీరదాకార – జయ మేరుధీర ॥జయ॥
జయ త్రిభువనావేశ – జయ రమాహృదయేశ
జయ పాలితదిగీశ – జయ దనుజనాశ ॥జయ॥
జయ కుచేల పురవాస – జయ నాట్యకళావిలాస
జయ కోటిరవిభాస – జయ మందహాస ॥జయ॥

—:సౌరాష్ట్రి – తిశ్రజాతి త్రిపుట:—

అంభోజాసను రాణి – హరీరాణి కొలువ....
అంబా!....ఓ....భ్రమరాం....బ.... ॥ అం ॥
శ్రీగిరీ నిలయుని – శివుని పట్టపురాణి....
అంబా....ఓ....భ్రమరాంబ.... ॥ అం ॥
వెలయు పద్దెనిమిది – వేదపీఠాపురాణి....
అంబా....ఓ....భ్రమరాంబ ... ॥ అం ॥

తుంబురు-నారదాదులు హెచ్చి పాడేరు....
అంబా....ఓ....భ్రమరాంబ.... ॥ అం ॥

చెలగుచు నవకోటి — సిద్ధులు సేవింప....
అంబా....ఓ....భ్రమరాంబ.... ॥ అం ॥

స్థిరముగ మమ్మేలు — శ్రీగిరి భ్రమరాంబ....
అంబా....ఓ....భ్రమరాంబ.... ॥ అం ॥

క॥ జనులార వినుడు సత్కథ
విన వేడుక గల్గు కర్ణపేయము గాగన్
గొనుడీ కర్ణామృతమును
ఘనుడా సిద్ధేంద్రయోగి కవితా రచనన్॥

క॥ వినుడీ ప్రణయ కలహమున్
కనుడీ భామాకలాప గాధను నటనన్
మును శ్రీ సిద్ధేంద్ర కృతిన్
ఘనుడీ పార్వతీశ కవి పూరింపున్॥

—: మ ధ్యా క్క ర :—

స్వామికి భామాకలాప - సారస్వత రచనాగ్రణికి
సమము ధృతపదవిన్యాస - చారీ విలసితమౌ నృత్య
ధాముక కూచిపూడి విబుధావళి గురుదేవునకును
మామక పూరితమ్మునకు - మమకారి సిద్ధేంద్రునకును॥

ప్రణమిల్లి అభ్యుదయ పరంపరాభివృద్ధిగా—నా పూరితంబైన భామా కలాపమ్మునకు కథాక్రమం బెట్టిదనిన —

—: అరభి - ఆది - దరువు :—

నారద:- నారదఋషి వెడలె
నళినోద్భవు తనయుడు ॥ నార ॥

అ॥ప॥ అరిషడ్వర్గము లెల్ల వీడి తా
హరి హరి హరి యని ననిశము దలచుచు ॥ నార ॥

1. జటామకుటధారి
సర్వచరాచరాది సంచారి
కలహభో క్త్రాధికారి — వనమాలధారి
అస్ఖలిత బ్రహ్మచారి ॥ నార ॥

2. కృష్ణాజిన దండ కమండలములు
కేలబూనియును తాంబుర చిరుతలు
క్షీరాబ్ధిశయను బాడగ
ననిదప-దరినని—దదపప—మగరిన యనుచును ॥ నార ॥

అబ్బా! ఆకలి! ఆకలి!

నేటిదినంబున భిక్షమిడువారు లేరా? త్రిలోకసంచారినై యెంద రెందరి వలననో కడుపార భిక్షము గొంటిని. ద్వారకావాసు డింత వరకూ భిక్షమిడడే? రాచరికము చేజిక్కినతోడనే రాజగోపాలుడు కన్నుమిన్నెరుంగక యున్నాడు. జ్యేష్ఠుడైన బలరాముడుండగా తానే రాజనిపించుకొనినాడే-ఏమా రాజ్యకాంక్ష? పసినాపలైన శిశుపాల జరాసంధుల జయించి యిదం క్షాత్రమని విఱ్ఱవీగుట కాదు. ఇదం బ్రాహ్మ్యమౌ నన్ను నిర్జించినగాని నీ రాజత్వ మంగీకరింపను. (ఆలోచించి) ఆ శతమఖుడు నాకీ పారిజాతసుమ మొసగెను గదా! ఈ లతాంతముచే నీ రాజత్వమును పరీక్షింతును. ఇదం క్షాత్రమని గర్వించిన నీకు యిదం బ్రాహ్మ్యమును చవిచూపింతును!

—: కందార్థములు — మిశ్రచాపు-శంకరాభరణం :—

క॥ హాటకగర్భుని తనయుడు
కూటికి మీ యింట నేడు-గుడువగ వచ్చున్
మాటకు కలహాశనమని
తేటగ గోపాలునితోడ దెల్పుము సుమమా॥

పాటలాధరి సత్య గర్వమేమని యెను మా
హాటకాంబరు రాజబిరుద మే
పాటిదో జూడంగ నెంచితి
బూటకంబును సేయనే
తృటిలోన యా గోపాలు శౌర్యము దెల్పుము సుమమా॥

ఇపుదే ద్వారకాపురమున కరిగెద. ఇందు కృతకృత్యుడనైతినా ?

-: సౌరాష్ట్రి - ఆది :-

రాజగోపాలం — రాధా లోలం
రాజగోపాలం — భజే మమజీవనం
రాధా లోలం భజే ॥రా॥

అ॥ప॥ అఖిలాండకోటి — బ్రహ్మాండ నాయకం
రాజగోపాలం — భజే మమ జీవనం
రాధాలోలం భజే ॥రాజ॥

1. శృంగార మోహనం — మంగళప్రదాయకం ॥రాజ॥
2. చాణూరమర్దనం - సాధులోక పాలనం ॥రాజ॥
3. నీలమేఘశ్యామలం — బాలనీల కోమలం ॥రాజ॥
4. అక్రూరవరదం - శక్రాది వినుతం ॥రాజ॥
5. నందగోప నందనం — నవనీత చోరకం ॥రాజ॥
6. బర్హి బర్హి కౌస్తుభం - పద్మపత్ర లోచనం ॥రాజ॥
7. పూతనాది భంజనం — పురుహూత వందితం ॥రాజ॥
8. సిద్దేంద్ర విరచితం - శ్రీపతీ కామితం ॥రాజ॥

(నిష్క్రమించును)

-: ఖమాస్ — ఆది — దర్వు :-

కృష్ణ:- రాజీవాక్షుడు - రాజగోపాలుడు
రాధాలోలుడు - రయమున వెడలె ॥రాజీ॥

అ॥ ప॥ తీరైన కస్తూరి తిలకము దిద్ది యు
త్రిమూర్త్యాత్మకమని
తెలియ బరచుచును ॥రాజీ॥

1. నీల మేఘ శ్యాముడు
నెడద యురము వాడు
నెమ్మోము చందురు
నెరికుంతలమువాడు ॥రాజీ॥

2. ఊర్ధ్వపుండ్రధారి
వన మాలికా ధారి
పీతాంబర ధారి
దనుజారి–మురారి ॥రాజీ॥

3. కోటి మన్మథా కారి
గోవర్ధనగిరిధారి
గోపీ జనోద్ధారి
కుచేల పురివారి ॥రాజీ॥

–: కై వా ర ము లు :–

1. శ్రీ మత్సకల గీర్వాణ సంస్తూయమానానంత శుభచరిత్రా – పరాకు బహూపరాకు.

2. సదానంద సందోహ – సనకసనందనాది మునివర–భ్రమర బృంద ఝంకార రంజిత పాదకమలా–పరాకు–బహూపరాకు.

3. మహాక్రూర కంస ప్రయోగ విపద్గాత్ర జంఝా ప్రభంజనా – పరాకు – బహూపరాకు.

4. దుష్టదైతేయ శిరః కందుకాఖేలా–పరాకు–బహూపరాకు.

5. అనంతకోటి సూర్యప్రకాశ కిరీట కుండలాలంకృతా పరాకు–బహూ పరాకు.

6. కనకమణికుండల ద్యుతి ఛటాభోగ గండభాగా పరాకు—బహుపరాకు.

7. కందర్ప సుందరాకార విరాజితా—పరాకు-బహుపరాకు.

8. శ్రీ లలితకళా సంస్థాన కూచిపూడి ఎస్టేటు రాజా శ్రీశ్రీశ్రీ రాజ గోపాలా పరాకు — బహుపరాకు.

9. రాధావధూటీ కఠిన కుచకుంభ సంభరిత హస్తా పరాకు—బహుపరాకు.

10. దేవకీ గర్భపయోధి సంపూర్ణ చంద్రోదయా పరాకు-బహుపరాకు.

11. యదువంశమూర్ధన్యా శ్రీశ్రీశ్రీ రాజగోపాలా పరాకు—బహుపరాకు.

విదూషకుడు:- ఏయ్, ఏయ్, కైవారకా! నాకు ...నాకు.... ఊ కానియ్యి.

కృష్ణ:- సఖుడా! నిన్నటి దివసంబున శిఖరమున గౌళిపడినదయ్యా!

విదూ: ఇన్ని యేళ్ళు వచ్చినను నీకీ చిన్నతనపు చేష్టలు పోలేదయ్యా! ఎవరి గోడ దూకితివి? చిన్నదా-పెద్దదా నెత్తినబడినది. అప్పుడు నన్నుకూడా బిలచినవో టోపీ రాళ్ళు నెత్తినబడకుండా చేతిమెల్లో, భుజం మెట్టో పెట్టెడివాడిని గదా? దెబ్బ యెక్కడ తగిలినది? సున్నము తీసుకురానా?

కృష్ణ:- (నవ్వి) వింతవాదనల వెక్కిరించకయ్యా! గౌళియన బల్లి యందురు. శిరమున పడిన ఫలమేమి?

విదూ:- అదా గొడవ. గౌళియంటే రాయో రప్పో యనుకున్నా. అయితే శిరస్సు కలహమన్నారు పెద్దలు.

కృష్ణ:- కలహమా? మనపై దండెత్తువారెవరు? అహో, రాజ్యకాంక్ష ఎంత చెడ్డది! వైరుల దునిమి రాజ్యము సుస్థిర మొనర్చితిమిగదా?

విదూ:- నే నెరిగినంతలో మనపై దండెత్తగల మొనగాడు కనిపించడే? ఎవరబ్బా అంట? (ఆలోచించి) అదిగాదు - నేనడుగు వానికెల్ల విసుగుకొనక సమాధానము చెప్పు. నీకు నెత్తిన బల్లి ఎచ్చట నుండగా ఏ సమయమందు బడినది?

కృష్ణ:- నిన్నటి సాయం సమయమున కేళికా గృహమునందుండగా శిరమున బడినది.

విదూ:- (వేళ్ళు లెక్కించి) సాయం సమయమున కేళికా గృహమున యుండగా బడుటనే ఫలితాంశ మేమంటే నీకు ప్రణయకలహము తప్పక కల్గును.

కృష్ణ:- శాంతి యేమి చేయవలయునో గర్గులవారిని కనుగొని రమ్ము.

విదూ:- ఉష్! ఇంతమాత్రము నాకు తెలియదూ? బల్లిపాటుకు శాంతి కంచికి వెళ్ళినవారిని తాకిన దోషపరిహారమని గ్రంథీకరించినారు పెద్దలు. ఆc.....ఉండు. మా మాతామహి కంచికి వెళ్ళినది. ఆవిడను పట్టుకు వస్తా. వెంటనే కౌగిలించుకో, తద్దోషపరిహారమగును.
(నారద ప్రవేశము. రాజగోపాలం రాధా లోమని పాడుచూ వచ్చును.)

నారద:- శ్లో॥ నమః పరమకల్యాణ – నమస్తే విశ్వమంగళ
వాసుదేవాయ శాంతాయ – యదూనాం పతయే నమః

కృష్ణ:- నారదఋషీంద్రా! అభివాదము – స్వాగతము. (ఆసనము జూపి) అధిష్టింపుడు.

క॥ తమరాక యెచట నుండియు
అమరావళి కిపుడు సేమమౌనే–ముల్లో
కములన్ సుఖజీవనులే
తమ ధర్మవు వీడకుంద్రె ధరలో విప్రుల్॥

నారద:- హే రాజన్! మీ యేలుబడిని ధర్మము నాల్గుపాదములు గల్గి లోక మెల్లెడల సుభిక్షమై మా తపోభ్యాసమున కే కొరంతలేక యున్నారము. ఎచ్చట జూచినను యే నోటవిన్నను రాజగోపాలం భజే మమ జీవనం రాధాలోలం భజేయని వినవచ్చుచున్నది.

గీ॥ శతమఖుని కొల్వుజూడ నే స్వర్గమేగ
పారిజాతమునిచ్చె సభక్తికముగ
తోడ కృష్ణార్పణంబంటి తోయజాక్ష
దీని గైకొని నా కోర్కె దీర్పుమయ్య॥

కృష్ణ:- ధన్యోస్మి! ఆహా! యేమి దీని సౌరభము.
నారద:- హే రాజన్! దీని మహిమ యెంత దెల్పినను తరుగదు.

—: కందార్థము - శంకరాభరణము — మిశ్రచాపు :—

క॥ శతయోజన విస్తారము
సతతమ్ము పరిమళమిచ్చు స్వాంతంబలరన్
ఋతుహేమంతము వేడిమి
హితమౌ సీతమ్ము గ్రీష్మఋతు వందందున్
అతులితముగను సిరుల కిరువగు నా యింటనుండన్
రతీ శచి ఃవతంసమగు నా లక్ష్మి వాణి భవానులకును
సుంతయైనను వాద దెందదు శోభనీయంబీ లతాంతము ॥నాయింట॥
కృష్ణ:- మునీంద్రా ! దేవతాసుమ మగుటచే దీని పరిమళము శాశ్వతమని తలంతును. ఈ సుమము నా పత్నులం దెవరికి అవతంస మగునో సెలవిండు.
నారద:- ఓ కపటనాటక సూత్రధారీ! నీకు తెలియని దేమున్నది ? నానుడే వినదలచితివి కాన, తోచినరీతి దెల్పెద వినవయ్యా రాజగోపాలా!
గీ॥ నాడు యురమునందే దాల్చినావు — నేడు
రాక్షసంబున బెంగ్లాడి రాణిజేసి
తివి గదయ్య - ఆ రుక్మిణీదేవి కీయ
నాది లక్ష్మిని బూజించినటుల గాదె॥
కృష్ణ:- మునీంద్రా! తమ యానతినే శిరసావహింతును.
నారద:- రాజగోపాలా! సెలవొసగెదవా ?

(తృప్తాస్మిః అనుచూ, త్రైస్చుచు నిష్క్రమించును.)

# వి ని కి ప ట్టు

భామ:— శా॥ రావే మాధవి - యేమే కుందరదనా
రావే సరోజాననా
ఓవోతక్కక మాయలాడి వినవే
ఓ యక్క ప్రాణేశ్వరుం
డీ వేళే సతిగూడెనో — యెవతె కో
ర్కీ-డేరెనో కానఁహో
నీ వెంధై నను వాని జూపవు గదే
నీరేజ పత్రేక్షణా॥

హాస్యం:— క॥ రావే యో సాత్రాజితి
రావే యో కూచిపూడి రసమణి భామా
రావే యో నృత్యకలిత
రావే తెరమరుగు వీడిరమ్మా బొమ్మా॥

రానులేదు పోనులేదు - రాయితాకి బోర్లపడనూలేదు—క్రిందనుంచి మీదికి — మీదినుంచి క్రిందకు వర్ణించుకు రావే సత్యభామా!

భామ:— క॥ వినవమ్మ యేమి తెల్పుదు
ఘనుడగు నా విభుని బాసి గావక యేనున్
పనిబూను వెతుక వచ్చితి
అనువందగ సత్యభామ నంచురె నన్నున్॥

హా :- క॥ వినవమ్మ హాస్యకారుఁడ
పవిగొని ప్రణయ కలహము బాపగ బవితెన్
సను సిద్ధేంద్రుఁడు—మాధవి
యనగను—మాధవు డందురు హరి మిత్రుండన్॥

-: దర్వు—ముఖారి—మిశ్రచాపు :-

భామ:- భామనే - సత్యభామనే - వయ్యారి ॥సత్య॥

అ॥ ప॥ భామనే పదియారు వేల
కోమలు లందరి లోన
రామరో గోపాలమూర్తికి
ప్రేమదాననైన ॥సత్యభామనే-సత్యభామనే॥

1. అట్టహాసము జేసి సురల
నట్టె గెలచి పారిజాతపు
చెట్టు దెచ్చి నాదు పెరటను
గట్టిగా నాటించుకున్న ॥భామనే॥

2. అట్టహాసము జేసి నరకాసురుని
బట్టి శిరము ద్రుంచి
కట్టడిని యున్నట్టి రాచ
కన్నెల విడిపించినట్టి ॥భామనే॥

3. కూరిమి సత్రాజిత్తు
కూతురై యిందరిలో
గోపాల దేవుని బాసి
తాళజాలక యున్నట్టి ॥భామనే॥

4. వారిజాక్షి ద్వారకని
వాసుని కౌగిటిలోన
జేరి మనసుదీర మరుని
బారి దీర్చుకున్న ॥సత్యభామనే—సత్యభామనే॥

నాయొక్క ప్రాణపదంబైన స్వామిని జూపింపలేవు గదమ్మా!

హా :— మీ స్వామివా రే యంగము వారో — యే చందమువారో. యే రూపు వారో, యే రేఖవారో నఖశిఖ పర్యంతం, శిఖనఖ పర్యంతం చెప్పుకు రావే సత్యభామా!

భామ:— గీ॥అవని నిల్లాలి సభలోన నడుగరాదు
చెట్టబట్టిన విభుపేరు జెప్పరాదు
అతని పేరేమిటంచు మీ రడుగ రాదు
కాన గురుతులు దెల్పెద పూని వినుము॥

శంఖము ధరించి నటువంటి వాడమ్మా!

హా :— క॥ అంభోజ నేత్రి వినుమా
డింభకు డింటింటను మొందితనంబున తా
భం భం భం బని శంఖము
శంభోయని నూదువాడు జంగమె చెలియా॥

వాడు దేవరవారి చిన్నవాడే సత్యభామా!

భామ:— చక్రము ధరించి నటువంటి వాడమ్మా!

హా :— క॥ చక్రమున మంటి ముద్దను
సక్రమముగ కుండజేసి సంతను దావిన్
విక్రయము జేసి బ్రతికెడు
చక్రధరుండు కులాలుడు సారసపాణీ॥

వాడు శాలివాహనుడే సత్యభామా!

భామ:— వేణువు ధరించి నటువంటి వాడమ్మా।

హా :— క॥ కరముల రెంటను వేణువు
కరము లరగబట్టి రాజకళలమరంగా
ధరపై నూదే మనుజుని
నరయంగా చెంచు కుఱ్ఱడందురె సుదతీ॥

వాడు గిరిజనుడు, చెంచువారి కుఱ్ఱవాడే సత్యభామ!

భామ:- మకర కుండలములు ధరించి నటువంటి వారమ్మా!

హా:- ఆ పంచనున్న వారెవరయః — పంచక్షీరః పం క్తిః మేమే — మీ మేనళ్ళుళ్ళం. అవ్వైతే లోపలికి రండి. యిత్యాః - కాళ్ళకు నీళ్ళియ్యవే కామకామాయ స్వాహా — దాహానికి నీళ్ళియ్యవే పుల్లక్క పుల్లక్క పృష్టం పశుమన్యుతేనః - యెందుకొచ్చారయా - యెందుకొచ్చారయా యద్వయహోతా - వివాహ కార్యానికి వ స్తిమిత్యాః మేమివ్వ- మేమివ్వము - మీ రియ్యకపోతే నమత్యాజ్యాయచ - క్షీమ్యాయచ - ఇస్తామిస్తా మేద్వయహోతాః మెన్నడు మెన్నడు యద్వయహోతా- అష్టమి నాడాలో ఘడియ మిత్యాః - శతావమానం భవతు - శతాయః పురుష స్థితేంద్రియ - ఆయుష్యేంద్రియ ప్రతితిష్ఠతి॥

వారు బ్రాహ్మణ చిన్నవాడమ్మా!

భామ:- వాడు నా అత్త కుమారుడమ్మా!

హా:- గీ॥ అత్తకొడుకని యంటివే యంబుజాక్షి
మెత్త మెత్తగ తినుటకు వత్తురమ్మ
చిత్త మొకరిపై దాచక వత్తురమ్మ
బుద్ధిహీనుని దలపకే సుద్దులాడి॥

వాడు జారచోర శిఖామణే సత్యభామ.

భామ:- వారు నా మామ కుమారుడమ్మా!

హా:- నాగలి బుజాన బెట్టుకు తిరుగువాడా - అతగాడైతే రైతు సోదరుడే సత్యభామ!

భామ:- వారు నా బావకు తమ్ముడు గావలెనమ్మా!

హా:- పెదబావ గడ్డంబు పెయ్య మేసింది. చినబావ చూస్తివా పెదబావ గోడు! "గౌరి కల్యాణా వైభోగమే" ఆ పేడిమొహం వాడా?

భామ:- వారు నా మరిది తన్న గావలెనమ్మా!

హా :- మరది మల్లవరాజు మహిషాసురుండు-చూడు-బలాయం అంటారే వాడా ?

భామ:- వారు నా బావామరది సందువారమ్మా!

హా :- వారా! బలరాముడు—సాత్యకి మధ్యవాడు అంటే-నల్లగా, లావుగా, పొట్టి పొడుగు కాకుండా యుంటాడు. అతగాడు నీకేమి కావలె నమ్మా !

భామ:— వారు నా....నా....నా ... (సిగ్గు అభినయించును)

హా :— వాని పేరు ?

భామ:- ఇంతోటి ఆడవారిలో, యింతోటి మగవారిలో సత్యభామ మగని పేరు చెప్పినదంటే సిగ్గుగాదటే ఓయమ్మ!

—: దరువు — మధ్యమావతి — ఆది :-

సిగ్గయెనోయమ్మ - వాని పేరుజెప్ప ॥సిగ్గయె॥

అ॥ ప॥ సిగ్గాయెనోయమ్మ — చిన్ననాటినుండి
వాని పేరు చెప్ప — వాడుక లేదమ్మ ॥సిగ్గ॥

1. వసుదేవ తనయుడై -వసుధ జన్మించిన
పశుల కాపరి—గొల్లబాలుని పేరుచెప్ప ॥సిగ్గ॥

2 ఘాటంపు రతులతో—కాటంపు నెలగొన్న
యే తీరునైనను—విభుని పేరు చెప్ప ॥సిగ్గ॥

3. చక్కని మోవి చురుక్కున నొక్కుచు
మక్కువ దీర్చేటి మగని పేరు జెప్ప ॥సిగ్గ॥

4. వేడుకతో ముచ్చటాడ మనసైన
చేడియరో యింత ఆడవారిలోన ॥సిగ్గ॥

మదన మోహనాకారుడే — మందర గిరిధరుడే — భామా! రమ్మన దాయెనే ?

హా :- కూడా పోవే....

భామ:— సత్యభామనన్నా వినడామెనే!

హా :— ఎందుకు వింటాడు? ఇంటికి వస్తే కాస్త కాళ్ళు పిసికి, మడుపు లందించి, కాసేపు సంతోషపెట్టిన పాపాన పోతేగా? వచ్చిన దగ్గర నుంచీ యీసడింపులేనమ్మో.

-: దర్వు - అది — ఆనందభైరవి :-

భామ:— మదనా....మ....ద ...నా....
మ. ద. నా........యనుచును ॥మదనా॥

1. మదన గోపాల మరపదేలర సామి
మారుని శరముల బారి కోర్వగలేర ॥మద॥

2. చుక్కల రాయడు ముక్కున వ్రేలిడి
ఏక్కుచు నాతో—నెకసక్కె మాడెర సామి ॥మద॥

3. రవ్వ జేయుట మేల రాజగోపాల
నేరము లెంచకు నెరనమ్మితిని సామి ॥మద॥

4. మదనా....మదనా....మదనా యనుచును
వదలలేక వాని-వలలో జిక్కితి
నే తాళలేనే - ఓయమ్మ॥

-: దర్వు - అది - తోడి :-

రంగుగ నా మెడ - మంగళసూత్రము
పొంగుచు కట్టిన - సంగతి మరువకు ॥రం॥

1. శయ్యకు రమ్మని పయ్యెదలో చెయ్యి
వెయ్యగ వచ్చిన — సంగతి మరువకు ॥రం॥

2. అధర సుధారస - మధురము గ్రోలగ
ప్రధమ సమాగమ—విధమెల్ల మరువకు ॥రం॥

3. ఆట పాయమున — తేటగ కన్నుల
కాటుక దిద్దిన - కూటమి మరువకు ॥రం॥

హా కృష్ణా! హా! ద్వారకా వాసా! హా శ్యామ యాదవ నందనా! హా! రాజగోపాలా! ఓయమ్మ స్త్రీజన్మ మెంత పాపపు జన్మమే ?

హా :– పచ్చిఅబద్ధం. ఆ మాట నేను నమ్మను. స్త్రీజన్మ మంత యుత్తమ జన్మమున్నదా? కారణ మేమంటే నగలు పెట్టుకొనవచ్చు. నాణ్యాలు పెట్టుకొనవచ్చు. ముద్దుముచ్చటగా యుండవచ్చు. నలుగురిలోకి నడిమికి రావచ్చు. ముగ్గురులోకి ముందుకు బోవచ్చు. ఆ తాళిబొట్టు చూచుకు కులుకుతూ నుండవచ్చు. అమ్మా! నిన్నొకటి యడుగుతా కోపపడవు గదా? స్వామివారీ మధ్య మన యింటికి రావటమే మానేశారు. కారణ మేమిటంటె ?

భామ:– ఓయమ్మ! ఒకానొకనాడు కేళికా గృహమున హంసతూలికా తల్పంబున, స్వామివారి పర్యంకమున నేనుండగా నిలువుటద్దమున, ప్రతిబింబముల జూచి– భామా! నీవే యందగత్తెవా? నేనే యందగాడనా? యని యనెనే ఓయమ్మ!

హా :– అటువంటి సమయములో నేను జ్ఞాపకమునకు రాను. నన్ను పిలచి నట్లుంటేనా వాతపెట్టినట్లు సమాధానము చెప్పేదానిని యేమన్నా చెప్పావా లేక తెల్లమొహం వేసి ఊరుకున్నావా ?

భామ:– ఆడబుద్ధి అపరబుద్ధి గనుక నేనే యందగత్తెనంటినే ఓయమ్మ!

హా :– మంచిపని చేశావు. వెనకంటికో సామెత యున్నదిలే? అందానికి నన్ను, పాటకు మా పెల్లెలండిట ఓ యిల్లాలు. తన శరీరం అల్లో నేరేడుపండని మరిచాడు పాపం.

భామ:– ఇంతలో పూవుల అలంకారములు మాటలురాగా నారదుడు తెచ్చిన పారిజాత సుమము కావలెనంటినే ఓయమ్మ!

హా :– అమ్మోయ్! నీకు చెప్పటం మరచా! నా మరపు మండిపోను. ఆ రోజు నే దక్కడనే యున్నా. ఆ నారదుడు పూలను తెచ్చి రాజ గోపాలంగారి చేతిలో పెడితే అన్నీ రుక్మిణికే యిచ్చాడే. కృష్ణా!

మా సత్యభామకు కూడా ఒకటియ్యవయ్యా యంటే నన్ను కో
వచ్చాడే? పోనీలే యని రుక్మిణమ్మా! మా సత్యభామకు కూ
ఒక్క పూవియ్యమని నోరుచేసుకు అడిగితే యేం మిడిసిపడిందే
యేం మిడిసిపడిందే ?

భామ:- అందుకు స్వామివారు యేమేమో చెప్పగా మాటలచేత, చేతలచే
రుక్మిణియందే గదా? ఇంత కపట నాటక మాడెదవా యని యన
కోపము వచ్చి దిగ్గున లేచిపాయెనే ఓయమ్మ !

హా :- అయ్యో! అయ్యో! యెంతపని చేశావే నా తల్లి! సమయం కనిపెట్టి
మాట్లాడవద్దటే! యెక్కడలేని యీసడింపులు అప్పుడే దొరిక
యటే? నా తల్లి! పండంటి కాపురము పాడుచేసుకొన్నావే?

భామ:— శ్లో॥ లోకే స్త్రీజన్మ దుఃఖాయ
మాభూదిద మరే రపి
కదళీ కంటక న్యాయో
ధృవ మత్రైవ దృశ్యతే॥

స్త్రీజన్మ మెంత పాపపు జన్మమే ఓయమ్మ! స్త్రీజన్మ మనగా - లేత
అరిటాకు వంటిదే ఓయమ్మ!

హా :— పురుష జన్మమో ?

భామ:- పురుష జన్మమనగా—అతి కాఠిన్యమైన ముల్లువంటిదే ఓయమ్మ!

హా :— ఆ ...నీ మాట నేనొప్పుకోనమ్మ! స్త్రీజన్మ మనగా పూపమువంటిది
పురుష జన్మమనగా ఘృతము వంటిది.

భామ:- ఓయమ్మ! అరిటాకు వచ్చి ముల్లుమీదబడ్డా, అరిటాకుకే మోసం
ముల్లువచ్చి అరిటాకుమీదబడ్డా అరిటాకుకే మోసం !

శ్లో॥ వృధా దుర్గేషు కుసుమం
వృధా నిష్పందికా సధా
వృధా నిశ్చంద్రికా రాత్రిః
వృధా విష్కాంత యవ్వనం॥

వృధా దుర్గేషు కుసుమం—పర్వతములందు, అడవులందు పువ్వులు బూచిన అవి కోశేరా? కొప్పున ముడిచేరా? అవి వృథా గాదటే ఓ యమ్మ!

హా:— నిజం చెప్పావమ్మా! అడవిగాచిన పూలు. కోతులపాలు, కొండ ముచ్చులపాలు. పెరటబూచినవి చక్కగా నలంకరించుకొనవచ్చు.

భామ:— "వృధానిష్పండితాసభాః" సభయందు పండితులుండిన, నాటివిద్యా ప్రసంగముల రమ్యత నీవెరుగనిదటే ఓయమ్మ!

హా:— తుదకు నన్ను బ్రాహ్మణార్థమునకైనా చెప్పను, కారణ మేమంటే విష్ణోరలంకార ప్రియః ఈశ్వరోయభిషేక ప్రియః బ్రాహ్మణోభోజన ప్రియః అన్నారు పెద్దలు.

భామ:— వృధానిశ్చంద్రికారాత్రిః రాత్రులందు ఆకాశమున యెన్ని నక్షత్రములున్నను. షోడశ కళాపరిపూర్ణుడగు చంద్రుడులేని రేయి వృధా గాదటే ఓయమ్మ!

హా:— అటులనవద్దూ! చంద్రుడులేని రేయి జారచోరులకు, మరెన్నిటికో యుపయోగము కలది.

భామ:— "వృధానిష్కాంతయవ్వనం" మనవంటి యవ్వనవతులకు పురుషుడు వద్దలేకున్న వృధాకాదటే ఓయమ్మ!

హా:— ఏమిటా మన వంటిట? తిమ్మనబంతి, రాజాగారి నగారా పారేసిన ఒంటెట యిటువంటి మాటలంటే నేనసలు మనిషినిగాదు. (కోపము అభినయించాలి. హాస్యాలంకార మంటారు. హాస్యములేని శృంగారము రాణించదు)

భామ:— మాటకే కోపము వచ్చినదేవమ్మ! మాటవరుస కటులంటినమ్మ!

హా:— యింకా నయం ఊరుకుంటే యింకోటంటావు.

భామ:— ఓయమ్మ! యిటురాగదమ్మ

-: దర్వు - ఆది - ఖమాస్ :-

నీకెందుకు కోపము మందయాన ॥నీ॥

హా:- మందయానమసిన అర్థము కొమ్ములు బారుగా రేపుమాపు రెండు శేర్ల పాలిచ్చునది. యనియేగదా నీ భావము. అను అనదలుచుకొన్నవి అన్నీ అను.

భామ:- దర్వు అను పల్లవి
మందయానెవ్వతో మందులిడి
పొంది వానిందు రానివ్వదేవో ॥మందయాన॥
నీ కెందుకు — కోపము
నీ విందు రాగదె — మందయాన॥
ఓ యమ్మ! నీ పేరేమమ్మ?

హా:- నా పేరు నీలవేణి! అంటే నా కురుల యందము జూచి - నా పేరిటి మురిపెముగా పెట్టుకున్నారు. (పరమాత్ముడే పురుషుడు - మనము పురుషాకారము గల స్త్రీలము) నా కురులెంత బారను కొన్నావు. మొదలు కత్తిరిస్తే నీలమండల వరకూ పడతాయి.

-: దర్వు — మిశ్రచాపు :-

భామ:- నీలవేణిరో - నీవిందు రావె ॥నీ॥
నీలవేణిరో నీవు జాలమిట్లు సేయక
బాల—నన్నేలు గోపాలుదేవే॥
॥నీవిందు రావె—నే రాను పోవే॥
దీందా-తద్దిందా—తకధికి ఝుణు—దదిగిణతోం॥

-: దర్వు — కాంభోజి - ఆది :-

నేనే....మి. సే....తూ............ ॥ఓ లలన నేనేమి॥

1. రాధా రానివ్వదె వాని ॥నేనే॥
2. రుక్మిణి టక్కుల దేమే ॥నేనే॥

3. మిత్ర విచిత్ర మేమే ॥నేనే॥
4. సునంద — ఆనందమేమే ॥నేనే॥
5. లక్షణ – కక్షను బూనె ॥నేనే॥
6. కాళింది కార్పణ్యమేమే ॥నేనే॥
7. ఈ ...వలపుల సాగర మీద
వశము గాదె – నా వశము గాదే – ఓ....యమ్మ ॥నేనే॥

–: దర్వు – ఆది – ఆనందభైరవి :–

కాముని బలములు గ్రమ్మకు వచ్చె ॥కా॥
తకిట – ధికిట – తొంగిట – నంగిట
ఝుం ఝుం ఝుం మనె తుమ్మెదలు
తాదిన్న — తద్దిన్న — తద్దిన్న – తకదిన్న
కుహూ కుహూ యనె — కోయిలలు
తత్తరికిట తక – కిటతక తరికిట తక (2 సార్లు)
కిచ కిచ లాడెనె కీరములు
తద్ధింత — తద్ధింత – తద్ధింత — తద్ధింత
పంచబాణుడు పొంచి యుండెనే ॥కాము॥

—: మ ధ్యా క్క ర :–

భూమిని నాడ జన్మమున
బుట్టినందుల కేమి సేతు
ప్రేమతో విభుఁడు రమ్మనుచు
బిలువనందుల కేమి సేతు
కాముని బాణ జాలములు
గ్రమ్మినందుల కేమి సేతు
ఏమి సేతు విధి చేతలకు
యింతనుకొని యేమి సేతు॥

-: దర్వు - త్రిపుట — ముఖారి రాగం :—

ఎందు బోతివి - యెందు బోతివి
యెందు బోతివి — రార - నందనందనా ॥నా సామి యెందు॥

అ॥ ప॥ పూర్ణేందు వదన - లోకత్రాతా నందన
గోవింద.....గోపాల.... ॥ఎందు॥

1. అందమా - నీ కది చందమా - నా
మందిరమే చేరవ దేమి
యెందుకోయీ యెడబాటము
చేదుకో నా హృదయాబ్జము ॥ఎందు॥

-: మి శ్ర చా పు :—

2. రాధికా లోలత కేమి - రావయా యీ వేళను
మాధవా నీమీద - మక్కువ - విడజాలను
చింత లుడిపి నన్ను కావుము
సిద్దేంద్రుని పాలనా
శ్రీధరేశ నా మనోహర — చేరరా యీ వేళనూ ॥ఎందు॥
ఓ యమ్మ! అందాకా పోయిరాగదవమ్మ!

హా :— ఆ - అందాకా పోయి — యిందాకా వచ్చితినమ్మా!
భామ:- అది గాదమ్మా. స్వామివారి వద్దకు పోయిరాగదమ్మ!
హా :- ఈ అర్ధరాత్రివేళ నేను పోలేనమ్మ. ఆ ఆచార్యవారి వద్దనున్న
కుంచకోల తీసుకురాలేను. ఆ గంటల తలుపులు తెరిస్తే యేం కష్
టడుతుందో-నాకు భయమమ్మా.
భామ:— గుడికి కాదమ్మా! ద్వారక పోయి రాగదవమ్మా!
హా :- ఈ అర్ధరాత్రివేళా ? అమ్మబాబోయ్, ఆ పొడుగాటి మూతి కుక్కలు
మీదపడి కరవవూ? నే పోలేనమ్మ.
భామ:— స్వామివారికి నాకు అనుసంధానముగా పోయి రాగదవమ్మ.
హా :— ఆ సంధానము నా చేత గాదమ్మ!

భామ:- రాయబారము పోయి రాగదవమ్మ!

హా :- ఆ రాయి రప్పా నేను మోయలేనమ్మా!

భామ:- ఓ యమ్మ మాధవి, నీకు పుణ్యముండును. పోయి రాగదవమ్మ!

హా : ప్రతిఫల శూన్యమైన పని చేయలేము గదా! ఆశ యనేది యెవరికైన యొకటే! యేమిస్తావ్?

భామ:- నావద్ద యేడు వారముల సొమ్ములున్నవమ్మ!

హా :- ఏడు వారములకు మూడు టంకాల ధరణము సొమ్మా-మీ అత్త గారు పెట్టినది. యెవరన్నా వింటే నవ్విపోతారు. మీ నాయన శమంతక మణితో నిన్నిచ్చిన కట్నంలో నాల్గో వంతన్నా లేదే? అంతేలే యీ రోజుల్లో. ఇదేమిటయ్యా యంటే, మావాడు పెద్దగా చదువుకున్నాడు. పట్టా పుచ్చుకున్నాడు. రాజ్యాలేలుతా డంటాడు ఆనందయ్యగారు.

భామ:- నేడు ధరించినవి రేపు ధరించకుండా యేడు వారములకు యేడుపెట్టెల సొమ్మున్నదమ్మా!

హా :- మా యింట్లో యున్నాయి మెంతులకు పెట్టె, జీలకఱ్ఱకుపెట్టె, ఆవాలకు పెట్టె, ఉప్పుకు పెట్టె, పప్పుకుపెట్టె, అగ్గిపెట్టె మంచానికి పొగా పెట్టా. ఇంకా యిటువంటివి చాలా ఉన్నాయి.

భామ:- ఇవిగాక యేడు ముస్తాబులున్నవమ్మ.

హా :- అంటే ముస్తాబాద, హుమ్మాబాద, హైదరాబాద, నిజామాబాద, శికిందరాబాద, హుజూరాబాద, అహమ్మదాబాద—అబ్బా-అవేగా?

భామ:- ఓ యమ్మ! అవిగాదమ్మ! ఒక్కొక్క వారమునకు ఆయా గ్రహములకు. అధిదేవతలకు, ప్రత్యధి దేవతలకు ప్రీతిగాంచుచు ఆభరణములు, పీతాంబరములు మొదలగునవి ముస్తాబులమ్మా!

హా :- అదా! విషయం. మావాళ్ళు రోజూ పెట్టినదే రేపు-రేపు పెట్టినదే యెల్లుండి — యిటుల పెట్టినదే పెట్టుకుంటూ యుంటారు. మీకేం మహారాజులు. అమ్మోయి, ఆదివారమునా డేం పెట్టుకుంటావు?

## సోమ్ముల పట్టు

భామ:- ఓ యమ్మ ఆదివారమునాడు కాశ్మీరు యెరుపు దుస్తులు, పద్మరాగపు అభరణములమ్మా!

హా :- గీ. ఉడుపులను జూచి పూజించు యుర్వి యౌట
నిట్టి రూపున బోవుట యెట్టులమ్మ
యెలమిని రవివారపు సొమ్ములిచ్చితేని
ద్వారకా వాసునకు రాయబారి నౌదు॥

భామ:- ఓ యమ్మ! అవి సూర్యువి ఆధీనములే!

హా :- ఏం చోద్దెమే నా తల్లి. అయితే వీరు యింటిదాని ఆధీనులే!

—: కందార్థము — మిశ్రచాపు :-

భామ:- క. కోరిన యున్ని దుస్తుల
రా రమ్మని బిలువ పద్మరాగపు నగలన్
శౌరీ కంకణ మిచ్చెన
మారామును జేయ కిపుడు మాధవు తెమ్మా
మరియాద కాదని మాధవి యనుమా
అర్కుని కూరిమి ఆదివారపు సొమ్ము
హారణంబు లిచ్చెద నలవానిగొని తెమ్మ
॥మాధవు తెమ్మా॥

హా :- అమ్మా! సోమవారమునాడెటువంటి నగలు, యెటువంటి ముస్తాబులు.

భామ:- ఓ యమ్మ! సోమవారమునాడు, స్వచ్ఛమైన తెలుపు సన్నని నూలు వస్త్రములు, మంచి ముత్యాలతో గూడిన ఆభరణములమ్మా!

హా :— గీ. అలివ నీవిభు తెమ్మని యంటివేని
యిపుడు దెచ్చెద వేగమె యిందువదన
ఇందువారపు సొమ్ముల నిచ్చినేని
రాజగోపాలు దెచ్చెద రయత నేగి॥

భామ:- ఓయమ్మ! అవి చంద్రుని ఆధీనమున నున్నవే.

హా :- యేం శాణాతనమే నా తల్లి. అయితే వాడు రాధాలోలుడే సత్య భామ !

—: కందార్థం — మిశ్రచాపు :—

భామ:- క. తెల్లని పలువల నిచ్చెద
కొల్లగ ముత్యాలసరులు గొనుము నిత్తున్
యుల్లము తల్లడ మందెను
నల్లని నా సామి నిటకు నయముగ తెమ్మా
చల్లని సోముండు తావెరపించెనమ్మా
కల్లగాదీ సోమవారపు సొమ్ముల నెల్ల గైకొని
పల్లె పల్లె తిరిగి రాజగోపాలుని తోడి తెమ్మా॥
॥నెరగన బొమ్మా॥

హా :- అమ్మా మంగళవారాలేం పెట్టుకుంటావు-యేం కట్టుకుంటావు?

భామ:— ఓయమ్మా! మంగళవారమునాడు, గులాబిరంగు ఉన్నిదుస్తులు, పగడాల దండలమ్మా!

హా :- క. మంగళవారపు సొమ్ముల
యుంగరముల తోడ నిమ్ము-యుప్పొంగుచు నే
శృంగారించుకు వేగమే
దొంగల రాయని పట్టుకు దోడ్కొని వత్తున్॥

ఉంగరములంటే మనవారికి చాలా యిష్టం. ఎప్పుడూ నోట్లో వేలేసుకు తిరుగుతాడు గాదూ-పిల్లంగోరు యూదుతాడుగా—బాబాయి.

భామ:— ఓయమ్మ! అవి అంగారకుని ఆధీనములే. మంగళగౌరీ ప్రీతిగా పుట్టింటివారు పెట్టిన ఆభరణాలే! ఎటుల యిత్తునమ్మా?

హా :— ఇంతలోకే అరిగిపోవులే నా తల్లి. విదర్భ మహారాజు రుక్మిణీ కల్యాణము రోజున కృష్ణునిచే — రుక్మిణీ నిన్నెప్పుడు విడచియుండనని ప్రమాణము చేయించాడు. దంపతుల నెడబాటుజేసి, ఆ పాతకము నే నెందుకు కట్టుకుంటాను. వాడు రాడులే.

—: కందార్థం — మిశ్రచాపు :—

భామ:- క. పగడాల దండ లిత్తును
పగలాడి గులాబి యవికవలువల నిత్తున్
పగబూనినాడు మారుడు
భగవానుని సాక్షియంచు బలుకన్ గదవే
జెగ్గిలేనని విభు తోడ ననవే
మంగళవారము పొంగి రాల్చిన సొమ్ము
సంగతిమీర నొసంగెద పతి తేవే పలుకన్ గదవే
॥జెగ్గిలెనని విభుతోడ ననవే॥

హా :- అమ్మా! ఉలిపినోరు ఊరుకుండదులే? బుధవారము నాగేం పెట్టుకుంటావు—యేం చుట్టుకుంటావు?

భామ:- ఓయమ్మ! బుధవారమునాడు ఆకుపచ్చపీతాంబరములు, పుష్యరాగపు ఆభరణములమ్మా!

హా :— ఈమధ్య అతగాడు మథురకు వెళ్ళినాడని వింటా. అమ్మో. అంత దూరము నడవాల్సిందే?

క. మధురాపురమును జేరగ
నధమం పది దినములైన నగు నడువంగా
పృధగా పోవుట యేటికి
బుధవారపు సొమ్ము లిమ్ము పోయెద నిపుడే.

భామ:- అవి బుధుని ఆధీనములే

హా:- యేమిటమ్మ ఓహోను వాడు భద్రాధీనంలో యున్నాడే! అది అనలే మీద పడి కరుస్తుంది కూడాను.

—: కంసార్ధం – మిశ్రచాపు :—

భామ:- క. స్వచ్ఛంపు పుష్యరాగము
అచ్ఛపులేతాకుపచ్చ యంబరమిత్తున్
మచ్చరము జేయబూనుట
పిచ్చికపై యస్త్రపనుచు భీతిలెనను మీ
కచ్ఛ బూనుట ఘనముగాదను మీ
స్వచ్ఛంద మౌనాటి సౌమ్యవారపుసొమ్ము
చెచ్చెర గైకొమ్ము శ్రీదైతునిటకు తెమ్ము
భీతిలెనను మీ
॥ కచ్ఛబూనుట ఘనముగాదను మీ ॥

హా:- వినినకొద్ది విడ్డూరంగా నేయున్నాయి. అమ్మా! మా అత్తారు లక్ష్మి వారంనాడు యేంచీరలు యే నగలు పెట్టారే.

భామ:- ఓయమ్మ! లక్షివారమునాడు పసుపుపచ్చ పీతాంబరము మరకతాభరణములమ్మా!

హా:- క॥ ఎరుపుగనైనను నీ యపె
సురగురువారమ్మునాటి సొమ్ముల నెల్లన్
మురిపెము దీర్చుక నిచ్చెద
గిరిధరు మూర్ఖము నేకరగింతును గాదే॥

భామ:- ఓయమ్మ! అవి బృహస్పతియా ధీనములే!

హా:- ఎంతసంగనాచివే నా తల్లి.

-: కందార్ధము - మిశ్రచాపు :-

భామ:- క॥ మరకతము పసుపు పీతాం
బరములను గొనుము చెప్పుమా ప్రాణేశువితో
నరమరిక బూన తగదని
మరుడల తూపులను విసరె మనది కననుమీ
కరివరదుని కదలిరమ్మను మీ
గురువారపుసొమ్ము కోమలి యొసగెద
కూరిమిమీర రాజగోపాలుని తోడితేవే
మనదికననుమీ
॥ కరివరదుని కదలిరమ్మను మీ ॥

హా:- తినగ తినగ వేముతియ్యనన్నారు పెద్దలు. అమ్మా! విందామనియుంది. శ్రావణపట్టీమీ అత్తారేంతెచ్చారే?

భామ:- ఓయమ్మ! శుక్రవారమునాడు తెలుపు పట్టుచీరెలు వజ్రాల నగలమ్మ

హా:- గీ. శుక్రవారపుసొమ్ముల జూచినంత
వెఱ్ఱులెత్తగరాదె నా వెంటునంటి
పైట చెరగున దోబూచులాటలాడి
యిటకు దెచ్చెద సొమ్ములనెల్ల నిమ్మ॥

భామ:- ఓయమ్మ! అవి శుక్రుని ఆధీనములే

హా:- ఎంతదానవే నాతల్లి వాడు సునందా ధీనుడే

-: కందార్ధము చాపు :-

క. తెలుపగు చీనాంబరముల
విలువగు వజ్రాలనగల వేర్వేరులుగా
పిలచిన కృష్ణుని నిచ్చెద
పలుమరు వేధించక గోపాలుని తెమ్మా

జాలము జేసిన సత్యమన దనుమా
వెలదిరో గైకొమ్ము భృగువారపుసొమ్ము
లాలించి పాలించు రాజగోపాలుదెమ్ము
గోపాలుని తెమ్మా
॥ జాలముజెసిన సత్యమనదనుమా ॥

హా:- ఇలాగుంటాయని నా కసలే తెలియదు. యేమోలే నోటివాపిరి తనావ
డుగుతా. శనివారమునాడేం నగలే?

భామ:- ఓయమ్మ! శనివారమునాడు నీలాలజిగినీలు నీలాంబరములు ముస్తా
బులమ్మా!

హా:- క. వినుమా అనుమానము విడి
శనివారపుసొమ్ములైన చయ్యనవిమ్మా
పనిబూని కృష్ణునిప్పుడు
వినయంబున వేడికొంచు వేగమే దెత్తున్

భామ:- ఓయమ్మ! అవిశనైశ్వరుని అధీనములే

హా:- అంత మొహంవాచి కూచోలా? నీవే పెట్టుకు కులుకు నాతల్లి. వాదు
మిత్రవిందాధీనుడే.

:- కందార్ధము — చాపుమిశ్ర -:

భామ:— క. నీలాల జగిని గొలుసును
వాలాయము నబుపురంగు వలువలనిత్తున్
బాలా నను లాలించెడి
లీలామానుషునితేవె లేమరోపోవే
జాలాము సేయక జనవెగతిగనవే
సలలితముగనిత్తు శనివారపుసొమ్ము
లలనరోగైకొమ్ము రాజగోపాలని తెమ్ము

లేమరో పోవే
॥ జాలము సేయక జనవే గతిగనవే ॥

ఓయమ్మ మాధవి యికనైనపోయి రాగదవమ్మా!

హో:- అదికూడ యిచ్చిన పోయివత్తునమ్మ.

భామ:- ఆదేమిటమ్మ?

హో:- అదేనమ్మ జ్ఞాపకము వచ్చుటలేదు.

భామ:- అనుమానమేలనమ్మ.

హో:- అదేనమ్మ చింతకాయల్లే యుంటుంది అదే నీ నగలపేర్లు జెప్ప విందాం!

భామ-: కేకికి, రాగిడి, చంద్రవంక, తమలపాకు, తిత్తురుపువ్వు, జాజాలం దులు, దండకడియాలు, పోచీమురుగులు, చెవ్వాకు, మొగలిరేకు, సూర్యచంద్రులు, పాపిడిబొట్టు, పాపిడిబిందిసీలు, రత్నాలజడ, పచ్చలపతకము ఒడ్డాణము, బులాకి, ముక్కుపుడక, ముంగెర

హో:- ఆ....ఆ....అదే....అదే....అదేనమ్మ! అది యిస్తివా మూతివిరు పుల ముచ్చట్లుదెల్పి మురిపెంగా తీసుకువస్తా.

భామ:- అది అడుగరాదమ్మా! స్త్రీలకు సకలాభరణములకు ముంగెర ముఖ్య మైనది నీకెటులనిత్తునమ్మ.

భామ:- అట్లాగా? అష్టభార్యలకు పదియారువేల గోపస్త్రీలకు శిరోభూష మైనటువంటివాడు. వారికెడబాటుజేసి యెటులు దెత్తునమ్మ.

హో:- క. అంగన లేనియిల్లు చతు
రంగబలంబులులేని రాజుని
స్సంగుడుగాని మౌనిజన
సమ్మతిలేని ప్రధాని కామినీ
సంగతిలేని యవ్వనము

శాంతములేని తపంబు స్త్రీలకున్
ముంగెరలేని భూషణము
మోదమటే భువనైకమోహినీ॥

హా:- నోరు అప్పాలపండు చెయ్యి చీకుముల్లు మెత్తగా యుంటే మొత్త బుద్దైందిట.

క. అడిగినవన్నియు లేదని
బుడిబుడిమాటలను జెప్పబూనుట తగునే
దడదడ గుండెలు బగులగ
వడివడి బోవంగ నంత వ్యర్థ నెరెపుమా

-: దర్వు — ముఖారిచాపు :-

భామ:— అక్కరో రావే నాముక్కు ముంగెరకోవే
నీకు మ్రొక్కెనుపోవే గ్రక్కున
గోపాలు తోడితేవె
రాజగోపాలు తోడితేవే ॥అక్క॥
దండిగరావే నా సందిట దండబుకోవే నీకు
దండముపోవే గ్రక్కున రాజగోపాలుతేవే ॥అక్క॥

హా:- ఇక తప్పక పోయివత్తునమ్మా! మతిమరపు నీవు తెల్పిన వచట తెల్పగలనో లేనోయనే సందేహము.

భామ:— పత్రికవ్రాసి యిత్తునమ్మ

హా:— అంశపత్రికలు చేరవేయుటకు స్వాములవారిమఠం బ్రాహ్మణుడనను కొన్నవా ?

భామ:- చీటివ్రాసి యిత్తునమ్మ !

హా:— అది కోమటిగుమాస్తాపని. వాళ్ళకదియలవాటు.

భామ:- శుభలేఖ వ్రాసి యిత్తునమ్మా

హా:— ఆ మాటన్నావు బాగున్నది. మా కవిఁగ్గపని. భుక్తి ముక్తి తృప్తి సమకూడును, అంటే వెళ్ళగానే తలకోస్తారు తలంటిపోస్తారు కాలు

లేమకోపోవే

॥ జాలము సేయక జనవే గఱగనవే ॥

ఓయమ్మ మాధవి యికనైనపోయి రాగదవమ్మా!

హా:- అదికూడ యిచ్చిన పోయివత్తునమ్మ.

భామ:- అదేమిటమ్మ?

హా:- అదేనమ్మ జ్ఞాపకము వచ్చుటలేదు.

భామ:- అనుమానమేలనమ్మ.

హా:- అదేనమ్మ చింతకాయల్లే యుంటుంది అదే నీ నగలపేర్లు జెప్పు వింద౦!

భామ-: కేకికి, రాగిడి, చంద్రవంక, తమలపాకు, తిత్తురుపువ్వు, బాజాబందులు, దండకడియాలు, పోచీమురుగులు, వెవ్వాకు, మొగలిరేకు, సూర్యచంద్రులు, పాపిడిబొట్టు, పాపిడిబిందినీలు, రత్నాలజడ, పచ్చలపతకము ఒడ్డాణము, బులాకి, ముక్కుపుడక, ముంగెర

హా:- ఆ....ఆ....అదే....అదే....అదేనమ్మ! అది యిస్తివా మూతివిరుపుల ముచ్చట్లుదెల్పి మురిపెంగా తీసుకువస్తా.

భామ:- అది అడుగరాదమ్మా! స్త్రీలకు సకలాభరణములకు ముంగెర ముఖ్యమైనది నీకెటులనిత్తునమ్మ.

భామ:- అట్టాగా ? అష్టభార్యలకు పదియారువేల గోపస్త్రీలకు శిరోభూషణమైనటువంటివాడు. వారికెడబాటుజేసి యెటులు దెత్తునమ్మ.

హా:- క. అంగన లేనియిల్లు చతు

రంగబలంబులులేని రాజుని

స్సంగుడుగాని మౌనిజన

సన్మతిలేని ప్రధాని కామినీ

సంగతిలేని యవ్వనము

కాంతములేని తపంబు స్త్రీలకున్
ముంగెరలేని భూషణము
మోదమటే భువనైకమోహినీ॥

హా:- నోరు అప్పాలపండు చెయ్యి చీకుముల్లు మెత్తగా యుంటే మొత్త బుద్దైందిట.

క. అడిగినవన్నియు లేదని
బుడిబుడిమాటలను జెప్పబూనుట తగునే
దడదడ గుండెలు బగులగ
వడివడి బోవంగ నంత వ్యర్థ నెచెపుమా

-: దర్వు — ముఖారిచూపు :-

భామ:- అక్కరోరావే నామఁకుక్క ముంగెరకోవే
నీకు మ్రొక్కెనుపోవే గ్రక్కున
గోపాలు తోడితేవె
రాజగోపాలు తోడితేవే ॥అక్క॥
దండిగరావే నా సందిట దండగకోవే నీకు
దండముపోవే గ్రక్కున రాజగోపాలుతేవే ॥అక్క॥

హా:- ఇక తప్పక పోయివత్తునమ్మా! పతిసురపు నీవు తెల్పిన వచట తెల్పగలనో లేనోననే సందేహము.

భామ:- పత్రికవ్రాసి యిత్తునమ్మ

హా:- అంతపత్రికలు చేరవేయుటకు స్వాములవారిమఠం బ్రాహ్మణుడనను కొన్నావా ?

భామ:- చీటివ్రాసి యిత్తునమ్మ !

హా:- అది కోమటిగుమాస్తాపని. వాళ్ళకదియలవాటు.

భామ:- శుభలేఖ వ్రాసి యిత్తునమ్మా

హా:- ఆ మాటన్నావు బాగున్నది. మా కవిఁగ్గపని. భుక్తి ముక్తి తృప్తి సమకూడును. అంటే వెళ్ళగానే తలకోస్తారు తలంటిపోస్తారు కాళ్ళు

స్తారు పేలుస్తారు పిండివంటలతో భోజనం రెక్కలు విరుస్తారు. దొవతులు పెడతారు దెప్పమ్మా చెప్పు వ్రాసుకుంటా.

-: ఉ త్త ర ము :-

భామ:— శ్రీమద్రత్నాకర పుత్రిక ముఖారవింద మరందపాన వివిసిత మిళిందాయమాన నందనందన ముచుకుందవరద మందరోద్ధర పరిహసితరాకా సుధాకర సుందర వదనారవిందుండగు శ్రీరాజ గోపాల స్వామివారి చరణారవిందంబులకు.

సత్యభామ నిటలతటఘటిత కరకమలయై యనేక సాష్టాంగ దండంబు లాచరించి చాయంగలవిజ్ఞాపనలు.

మజ్జనకుండగు సత్రాజిత్తు నన్ను మీకిచ్చి వివాహంబొనరించిన ప్రభృతి వజ్ర వైఢూర్య నీలగోమేధిక పుష్యరాగస్థగిత పద్మరాగ మరకత మహాబలాది సకలవికల్పిత నానావిధ చిత్రవిచిత్ర జాంబూనద రత్ననిర్మితంబగు హంసతూలికా తల్పంబున దివ్యమంగళ విగ్రహాకారులై గాఢాలింగనం బొనర్చి యుపరతి సమరతులన్ దేల్చుచు సాహ్లాదంబునొందుచున్న తమ చిత్తంబా రుక్మిణీసతియందు సంపూర్ణంబుగానునిచి ప్రాణసఖినగు నా యందు నిర్దయత్వమున కఠినమనస్కులై విడనాడియున్ననాటి నుండి మారుండు క్రూరుండయ్యె. నిశిత కుసుమ శరఘాతంబుల హృదయంబు భిన్నంబుగా నొనర్చె. కీరంబులు క్రూరంబులై యవ్వారితంబుగా నాదంబుల జేయుచుండె శుకపికనికరంబు లోకించుక కరుణించక కూయదొడంగె తుమ్మెదలు తలదిమ్మ బుట్టించె చంద్రుండ నలుండాయె మలయానిలుండు కాలాంతకుండాయె.

నన్నీ క్రూరాత్ముల బారింబడద్రోసి మన్మందిరమునకుం విచ్చేయక నావంటి యబలయెడ చలముబూనుట ధర్మంబుగాదు.

కావున నన్ను కరుణించి యిటకు విచ్చేసి మకరకేతన కేళిందనిపి సంతసంబొనరింప ప్రార్థితురాల.

క. చిత్తజుని బారికోర్వక
 తత్తరపడి వ్రాసినాను తప్పోయొప్పో
 చిత్తమున కోపమెంచక
 యిత్తరి బ్రోవంగరావె యిదియే ప్రణుతుల్॥

చిత్తగించవలెను

ఇట్లు
ప్రాణసఖి = సత్యభామ

—: దర్వు – హరికాంభోజి — త్రిశ్రచాపు :-

భామ:- వాదమేల పోవె – నా నాధుసిందు లేవె
 ఆదరించ నీవె – నా కాధారమైనావే ॥వాద॥

 నిక్కము తులమెత్తు నా – ముక్కునున్న నత్తు
 చక్కని ముఖమెత్తు – చేర్చుకొని బొట్టు నిత్తు ॥వాద॥

 బంగరు వరబొమ్మ – నను భంగపరుపకమ్మ—ఒక
 సంగతి వినవమ్మ — ముక్కు ముంగెర నిత్తునమ్మ ॥వాద॥

 ఆశలు వ్యర్థమాయె — ఆయాస మధికమాయె–వాని
 బాసలు కల్లలాయె — దోసకారి పాలై పోయె ॥వాద॥

 భావజ జనక – యింక భావ్యమె నీకీ కినుక
 రాజకీయ మనక రావె – రాజగోపాల మసలక ॥వాద॥

ఓయమ్మ! దారి చూడవమ్మా! మంచి శకునమో కాదో చూడవమ్మ!

హా :– ఇద్దరు సువాసినులు యెదురుగా వచ్చుచున్నారు. గురుశిష్యు లిద్దరు వేదము సంతవేయుచూ వచ్చుచున్నారు.

-: దర్వు - కాంభోజి - ఆది :-

భామ:- శకునాలు - మంచివాయెనమ్మ
అమ్మా - ఓ యమ్మ ॥శ॥

అ. ప. శకునాలు — మంచివాయె
చెలువుడు రాకపాయె ॥శకు॥

1. ఉత్తరాన — యురుము లురిమే నమ్మ
ఓ లలనా యేమే
పడమర — పాల దీర్చెనమ్మ
ముత్తైదువ లిద్దరు - అంగనా
శోభనము పాడిరమ్మ
వనజాక్షి - నా విభుడైన
వాడు వచ్చు గాబోలు ॥శకు॥

2. భూసురు లిద్ద రెదురై రమ్మ
పూర్ణకుంభాలు - శిరసందు నిడుకొని రమ్మ
యీ జగమెల్ల వ్రాసేటి వాని గన్న
వాడు వచ్చు కాబోలు ॥శకు॥

గరుడుండు దారి వచ్చెనమ్మ
యిద్దరైదుగురు తరుణుల హొడగంటినమ్మ
శుకపిక పైడిగంటలు
కలయబలికె గాబోలు ॥శకు॥

## శశిహేల

భామ:– శరధి సంజాత భీకర బడబానలంబా ?

హే :– అది ఉదయించు నిశాకర మండలంబు.

భామ:– ఆ కన్పట్టు దట్టంబగు ధూమమేమే ?

హే :– అది విరహజనులకు పాతకపు కళంకు.

భామ:– ఓయమ్మ ఆ జ్వాల లేమమ్మ ?

హే :– భానుకోదయరాగ విలసనములు.

భామ:– ఆ కలకల ధ్వనులేమి ?

హే :– అయ్యవి కాకలీ ధ్వనులు.

భామ:– ఓయమ్మా! యీ తెక తెక లేమే ?

హే :– నీవే యూహించుకోవమ్మ. (మదనతాపం)

–: దర్వు – ఆది తోడి :–

భామ:– నే తాళలేనురా – ఓ చందమామ ॥నే॥

అ. ప. నే తాళజాలర – బాలా – యీవేళ ॥నే॥

1. నా పాలి నిర్దయ నీ కేలర – యోరి చంద్ర
వేసారు నన్నిట్లు వేధించ న్యాయమే ॥నే॥

2. దోసకారి మరుదు — మీసము దిద్ది
రోసముతో మందహాసము జేసెను ॥నే॥

3. హాలాహలాను జనీలావు దెల్పర
యీలాగు రవ్వజేయ
యేలాగు వేగింతు ॥నే॥

సీ. రాచవారికి బుట్టి-రమణుల నేచేవు
అందమా యిది నీకు చందమామ
రాత్రించరా నిన్ను రాజనంగను సిగ్గు
సందిలి దొంగ వో చందమామ
పరవడి దినముల పాము నిన్నంటగా
సగమాయె నీ రూపు చందమామ
గురుని యిల్లాలితో-గూడినావను నాటి
నింద నీకును జాలు చందమామ

గీ. అమర సంఘంబు నీ కళలారగించ
నెగ్గు సిగ్గులులేని నీ కేమి చింత
కమలవైరివి నీ కళల్ గరగిపోను
చలము నామీద నేలనో చందమామ॥

క. పగవాడవు తమ్ములకును
పగవాడవు సాధులకును-పాదోధులకున్
పగవాడవు జక్కవలకు
పగవాడవు తోడబుట్టు పడుచుకు చంద్రా॥

సీ. గరళకంఠుడి బండి కళ్ళుగా జేసిన
సమయ మందున నీవు సమయవైతి
వలరాహు నినుబట్టి ఫలహార మడిగిన
సమయమందున నీవు సమయవైతి
వల్లగురుండు నిన్నలగి శపించిన
సమయమందున నీవు సమయవైతి
పాండురోగంబుతో పాలిపోయిన యట్టి
సమయమందున నీవు సమయవైతి

గీ. వహహా! నీ యాయువేమని యనగవచ్చు
సుదతి రోహిణి మంగళసూత్ర బలిమొ
గాక నిను గన్నవారల కడుపు చలవొ
యేది లేకను నీ బ్రతుకెట్లు నెగ్గు॥

# మురుగోల

—: దర్వు — సమయతి - పద్యమావతి :—

రాగము:- ఏవరే యెదుట వచ్చె వాడెవరే ॥ఎవ॥

1. మంచి యవ్వనుడైన వాడెవడే
యిపుడు పవనము విసరు వాడెవరె
కవగూడు చెలికాని పిలువరె చెలులార ॥ఎవ॥

2. చిలుకలు గుంపులుగ నిఱవ
వెనుక మలయ మారుతము విసర
తుమ్మెదలు బలములు నిఱవ-ఓ చెలులార ॥ఎవ॥

3. వెచ్చని గాడ్పులు పైపై హెచ్చెనే
మరుడు వచ్చువింట శరములు బూన్చెనే
పంచబాణములు-పరువున వచ్చెనే ॥ఎవరే॥

4. గంధ గజ స్కంధంబున
దంఘరముగ భేరివైచి-పటునాదించెన్
దం దం ధణ — దం దం ధణ
దం దం ధణ నాదమెసగ ధరణి వడంకెన్॥

—: పంచ చామరములు :—

ప. కటీపిటీ విటీ జనంబు
గాక మాటలాడగా
తుటారి నమ్మిటారిగాడు
తుంట జంట నంటిచే

తుఃశీ – తుఃశీ – తుశీ – శరంబు
తూరి పారవేశెహో
కటా కటా – కటారిగాడు
కాముడెంత శూరుడే॥

వ. ఝళల్ ఝుముల్ – ఝుముల్లటంచు
నార్భటిల్లు చుండగా
తళుక్ – తళుక్ – తళుక్ మటంచు
దండె వన్నె మీరగా
ఛణా – ఛణా – ఛణా లటంచు
చప్పుడింపు వేగితో
భళా – భళా – భళాన వచ్చె
పాపజాతి మారుడే॥

వ. మెరుంగు వాడి తూపులన్ స
మీకరించి శూరతన్
కురంగ లోచనల్ మదిన్ దిగు
ల్కొనంగ జేయుచున్
తురంగ మెక్కి యింపుగా లీ
ధూరతీ సమేతుడై
ఓరింపరాని పంకజమ్ము
బాణమేసె నెచ్చెలీ॥

వ. పఠాని రౌతు ఠీకునన్ కృ
పాణ మంద శోకమున్
శరుండు పాపజాతి పంచ
సాయకుండు నా హృదిన్
కుఠార సీమ గాంచి వేయ
కులుక్కు గుబ్బలున్ వడిన్
పెఠేల్ – పెఠేల్ – పెఠేల్ యటంచు
ఫీడె కంచుకంబుతోన్॥

ప. పరీ పరీ పరీ విధాల

బిల్కు చిల్కు గుబ్బముల్

మరిన్ మరిన్ మరుండు

మామిడాకు బాణమున్

కరీ కరీ కరీని గ్రుమ్మె

ఘాతకుండు నా యెదన్

హరీ హరీ హరీ విధాత

యానవాల దేమకో॥

ప. దడా దడా దడాల గుండె

తల్లడింపు సేయగా

నెడా పెడా పెడా మనంబు

హెచ్చరింపు సేయగా

వడీ వడీ వడీని వచ్చె

వాడి బాణ జాలముల్

ఛడేల్ ఛడేల్ ఛడేల్న దాకె

సన్నజాజి బాణముల్॥

# మందులపట్టు

:- దర్వు - పంతువరాళి — జంపె :-

భామ:- మోసపోతి నమ్మలార - మొదలు నే నెరనైతి ॥మో॥

1. తాప మాపలేనైతి - దయగ మాటలాడనైతి
చెప్పినపుడే సేవజేసి - చరణములు వత్తనైతి ॥మో॥

2. ముంగిలివేళ గాననైతి - ముందె కౌగిలివ్వనైతి
కొంగు బరచి వాని వలపు - గ్రుమ్మరించుకోనైతి ॥మో॥

3. అబ్బినపుడె గోపాలు - నెలమి కౌగిలివ్వనైతి
గుబ్బలు వాని చేతికిచ్చి-యుబ్బుచు యూరకుండనైతి ॥మో॥

ఓయమ్మ స్వామివారికి మందు బెట్టినారమ్మ!

హా:- అయ్యో - అయ్యో! నా యిల్లు బంగారంగాను - వాళ్ళెట్టా పెట్టారు? వీడెట్టా తిన్నాడంట!

భామ:- తమలపాకు పచ్చిపోకతో బెట్టినారమ్మ.

హా:- అంత పాపం గట్టుకున్న వారెవరే ?

భామ:- ఆ రాధ, రుక్మిణి, మిత్రవింద, జాంబవతి, సునంద, లక్ష్మణ, భద్ర, కాళింది కలయబలికి పెట్టినారమ్మ. ఓయమ్మ! మందుబెట్టు విధము నీకు తెలియునమ్మ.

హా:- హూ వారటువంటి వారు గాదమ్మ! నే చెప్పినట్లు వింటారు-కూచో మంటే కూచుంటారు — నుంచోమంటే నుంచుంటారు. ఎప్పుడూ నా గుప్పిటిలోనే పెట్టుకుంటానమ్మ. నీవంటి తెలివితక్కువ దానను గాను.

భామ:- ఉ. జిల్లేడుమొగ్గ శంఖపొడి
జీలగపత్ర రసంబు పుష్పొడిన్
నల్లని జీలకఱ్ఱ నవ
నారింజ వేరును-శొంఠి మిర్యముల్
చల్లతో నూరి నా సవతి
చాటుగ వీడమునుంచి యిచ్చెనే
వల్లభు నన్ను గొల్వడిక
వానికి నేమి యుపాయమే చెలీ॥

—: దర్వు - దేవగాంధారి - మిశ్రచాపు :—

మందులమారి నా సవతి-యేదో
మందు బెట్టెనే యా సుదతి ॥మందు॥

అ. ప. అందరికన్న తా నానంద మందగోరి
విడములోన నుంచి
విభునకు బెట్టెనె ॥మం॥

1. యెన్నో మాయలు నేర్చుకున్నది
యావెన్నని తా జేర్చుకున్నది
పిన్న పెద్దల నంపి-పిలిపించి చెప్పరె
కన్నెరొ యిటువంటి కార్యము తగదని ॥మందు॥

2. మగని నన్నెడ బాపెనమ్మ
యింత మర్మము గలదటె కొమ్మా
మగువరో మీరంతా-మర్యాద కాదని
ఆ మగువతోడ—తగినట్లు దెల్పరే ॥మందు॥

3. దోసమనుకో దాయెనే
ఉసురోసుకో మనసాయెనే
దేశమెందైన యిట్టి యాడది యున్న
వాసిగ కాపురము జేయు టెట్లులమ్మ ॥మందు॥

4. వాసిగసిద్ధేంద్రస్వామిని
కృపనేలిన వైకుంఠధాముని
కేళికిరమ్మని కిటుకు పరచినుందు
లాలించి పతికి తాంబూలంబుతో నిచ్చె ॥మం॥
ఓయమ్మా! మందునకు విరుగుడు దెప్పెదవినవమ్మా!

సీ. కస్తూరి జాభరా కరివేప పత్రంబు
తాళకంబును కొంతి చేలయిగురు
తామరదుంపయు దవనంబు పుష్పాది
వచ్చివసుపు లేతబసవపత్రి
మునగమొగ్గయు తేనె ముసరింగువ రసంబు
నెనులిఖర్జూర దానిమ్మరసము
గజనిమ్మరసమున కర్పూరమును జేర్చి
కరిమేకపాలతో గిలయనూరి

గీ. విడములోనుంచి యిచ్చిన గడియలోనె
వెస్కబారిన మందుకు విరుగుడౌను
అన్నిమందులకిది మేటియౌషధమ్మా
ఆయురారోగ్యములదేలు హరియునింక॥

హో:- అయమ్మా! నా తోడికోడలు జెప్పిన విరుగుడుమందు వినవమ్మా!
చ. మగువల చేతిగాజుపొడి
మంచిదిగా నొకశేరు నూనెయున్
తెగువతొన నల్లమందుయును
తెల్లటి గన్నేరుకాయ బెల్లమున్
వగపునుమాని నూరితిన
వ్యాధులుబుట్టవు బుద్ధిచెప్పుడున్
మగుపలుపొందు గోరదిక
మాటముజెప్పడు నొప్పిజెప్పడే

భామ:— ఓయమ్మ! యెంత సాహసివే ? వశీకరణములు తెలియునమ్మ !

గీ. గరికవేరులు నిమ్మాకు కప్పురంబు
శొంఠి దానిమ్మకమలముల్ చూర్ణపరచి
తేనెతోగూడ మర్దించి తేటతీసి
పైని జల్లిన కోర్కెలు పండునమ్మ॥

హే:— హుష్! యింతమాత్రమునకే వశ్యుడైతే అదెంతగాను. నా స్నేహి
తురాలు దెల్పిన గోషాయి చిట్కా తెల్పెద వినవమ్మ.

సీ. నల్లేరు పల్లేరు నాగముష్టివేరు
నేలవెంపలిబల్సు నల్లవుప్పి
కారు మునగగొచ్చి గోరంట పుమ్మెత్త
పత్తాకు వెల్లుల్లి పాదరసము
నేరేడు మారేడు మురుకుండ జిల్లేడు
గాడిదగడపాకు కాకివెదురు
జముడు దురదగొండి సాగనారరసంబు
నేలవేము పుగాకు జీలకఱ్ఱ

గీ. కాకరాకుల రసముతో డగలయ నూరి
మాత్రగాజేసి యొకపూట రాత్రియందు
విడములోనుంచి యిచ్చిన గడియలోనే
వెఱ్ఱిలెత్తగ మగువలవెంట బడును॥

భామ:— సీ. తియ్యని మాటలతీపి చొక్కితిగాని
గళమున విషమౌటగాంచి యెరుగ
నావంటి మనసని నమ్మియుంటిని గాని
కఠిన చిత్తుండౌటగాన నైతి
మునిముచ్చుమాటల మోసపోయితి గాని
కపట నాటకమాడ గాననైతి
సతమాయెనని యెంచి సరస మాడితిగాని
బొంకియారడిజేసి బోవుటెరుగ

Te
793.31954 K4
PAR-M2



గీ. యేమిజెయుదు మగవారికేడదయలు
వద్దనున్నపు డొకమాట బలుకుచుంద్రు
కడకు దొలగిన యామాట గడగివేయు
పడతి కృష్ణుని నమ్మిన ఫలములేదు॥

ఓయమ్మ ! స్వామివారితో నా కడసారి మాటలదెల్పవమ్మ !

సీ. అచ్చపుతేనెయు పచ్చకర్పూరంబు
మేదించి గ్రుక్కెడు మింగువాన
అల్లమామిడిచిగురాకు బాకునుజేసి
హెచ్చుగా రొమ్మున గ్రుచ్చుకొందు
సొరయాకు సానపై చరను వాడిగనూరి
కుత్తుకనొక్కుడు కత్తెరందు
పండువెన్నెల చిచ్చుపాడిపై శయనించి
సాహసంబున నేను జచ్చుదాన

గీ. ఆడజన్మంబు నీరీతి నధమమౌట
వానిదలచుక ప్రాణముల్ వదలుదాన
అంత్యమందు నా కడహరి యాశలెల్ల
రాజగోపాలునకు దెల్పు రాజవదన॥

—: దర్వు - మిశ్రచాపు - తోడి :—

పోయిరాగదవమ్మ నాథునికడకు ॥పో॥

అ. ప. తోయజాననయా - మాయలాడినిగూడి
మేచందమున — నున్నవాడో వినవలె ॥పోయి॥

1. బాలగ గాలికీలి పోలికతీయ
నేలాగు మన నేర్తునే

G-245

యీవిరి కోలల కెటు లోర్తునే
మేలు మేలికజాలు
యేలజాలము జేయ
పాలుమాలి రాజగోపాలు కడకును ॥పో॥

2. మానకనేను — కానిపోనివాని
వైనము గనుగొంటినే
యీభ్రమలిక — మానెదనను కొంటినే
ఈశునిపైనను — భారమువేసి
నేనునేనని మది - మారాము జేసెనే ॥పో॥

3. అంటిన పగ వెంటనంటి తుంటరి
తుంట వింటివానికి యోధుగా
రాజగోపాలుఁడిటకు రాడుగా
కంటి జంటగ వాల్గంటి గుంటను జేరి
మంట మండగవింపే
వారింటిలో జంటలు ॥పోయి॥

# రాయబారము

-: దర్బు — కాంభోజి - ఆది :-

వెడలె రాజగోపాలుడు
వెడవిల్తుడో యన ॥వెడలె॥

అ. ప. సరసీజ నయనుడు
చిరునగు వొలియగ ॥వెడ॥

1. కర కంకణములు మ్రోయగ
కౌస్తుభమణి - యురమునందున మెరయగ
కర్ణకుండల రుచి — గండయుగళి బర్వగ ॥వెడ॥

2. కరకు వజ్రము లమరిన
కాంచన మకుటము
శిరము నందున చెలగగ
ఇరు భుజముల
భుజ కీర్తులు వెలియగ ॥వెడలె॥

3. సీతాంశు ముఖమందున
సింధూర తిలకము
పీతాంబర ధారియై
ధరను కుచేలపురి-రాజగోపాలుడు ।వెడ।

ఉ. ఏటికి వచ్చె నారదుడ
దేటికి దెచ్చెను పారిజాతమున్
మాటలపోగు నా సుమము
మానిని రుక్మిణి కేల నిమ్మనెన్

పాటల గంధి సత్య నెడ
బాటుమా జేసిన పొట్ట నిండెనే
ఘోటక బ్రహ్మచారి కెటు
గోచరమౌను వియోగ వేదనల్.

-: హంసధ్వని — ఆది :-

ఎన్నటికో నా కొమ్మను జూచేది
యెన్నటికో నా మనసు చల్లనయ్యేది ॥ఎన్న॥

అ. ప. వన్నెలాడి బన్నసరులు నా యురముపై
యూగాడగా నేను—యుపరతి గలిపేది ॥ఎన్నటి॥

1. మేటి చందురు కావిపా హడపై పసిడి
పట్టుచేలము చాల పసమీర గట్టి
కోటి వేలకు గొన్న—తాటంకముల నొప్పు
కోమలి చెక్కి-ళ్ళ కొసరి ముద్దాడేది ॥ఎన్న॥

2. మోము మోమున జేర్చి—మోవి తేనియ దీర్చి
వేమరు నా మనసు—నొకటిగ జేర్చి
కామశాస్త్రము జదివి—కథలు జెప్పెదు నేను
కామిని నెమ్మదిని—కలసి కౌగిట జేర్చే ॥దెన్నటి॥

3. జోడుగూడి-తోడిరాగము బాడుచు
మేడపై నుండి—మేల్మేల్-ల్మేల్-మేలనుచు
వేడుకతో దాని—విడువక నెప్పుడు
తోడబంగారు-తూగుటుయ్యాల లూగేది ॥ఎన్న॥


— (క్షేత్రయ్య)

హా :— క. దండమయా విశ్వంభర
దండమయా పుండరీక-దళనేత్ర హరీ
దండమయా కరుణానిధి
దండమయా యిపుడు నీకు-దండము కృష్ణా.

కృష్ణ:- మాధవీ! యెప్పుడు వచ్చితివి? సత్యభామ యేమన్నది?

హా:- ఆ మాట విని యెన్ని రోజులైనదో స్వామి - అంత భాగ్యం కూడానా? మీ రానాడు కోపమువచ్చి వెళ్ళినది మొదలు అన్నపానాదు లెరుగదు. చిటికెనవ్రేలి యుంగరము, యొడ్డాణముగా ధరించు చున్నది. తమకీ కష్ట జూపమన్నది. యేమి యాఘాయిత్యము జేయునో? చదవండి ప్రభూ !

కృష్ణ:- మాధవీ! పోపువనా ?



## అంకితము:

గీ॥ స్వామి సిద్ధేంద్ర నీ యాజ్ఞ సలుపబూని
నీదు భామా కలాపమ్ము నేర్పు కొలది
నిపుడు పూరించి — అంకిత మిచ్చినాడ
నందికొనుమయ్య దీని కృపాంబురాశి॥

# మూర్ఛపట్టు

సీ. మన కెన్నఁడును రావి—మౌన మిప్పుడు పూని
  మాటాడ వేటికే మధురవాణి
నీకు నాకును గాని—నేరముల్ మదినాని
  మనసియ్య వేటికే మధుపవేణి
అరమరికలు పూని—యా నేస్తములు మాని
  మొగమేల జూపవే చిగురుబోణి
నిన్ను నమ్మినవాని—నన్నొక్కఁడును లేని
  యగ డేల జేసెదే యబ్జపాణి
గీ. మారుఁడదె—కానితనమూని పోరె—బోని
నీదు పుణ్యానికేని నే నేరనేని
కాని మరి దానికేని నీవైన గాని
కరుణ జూడఁగ రావెయో మదుని తూణి॥

— (ముద్దుపళని)

భామ:— ఎవరే వారు ?

హా:— వారేనే! మీవారు!

భామ:— వారెవరే ?

హా:— ఆఁ వాడేనమ్మ! మన రుక్మిణి యింట్లో పూజపత్రి తీసుకువస్తుంటాడే—వెఱ్ఱిబాగులవాడు. ఉద్ధవుఁడే? ఆ రెండోవాడు రాధ తమ్ముఁడే? అది పంపిందే ?

భామ:— దేవకీ తనయుడు వీరేనా? వసుదేవాత్మజుడు యీయనయేనటమ్మ! బలరామానుజుడు వీరేనా ? సాత్యకి అన్నగారు వీరేనా? (పెదవి విరచి) కాదే? మన స్వామి కాదే? అయ్యో! ముఖము పాలిపోయిన దేమే ?

హా :— బెంగపెట్టుకున్నాడే-అందుకనే అలాగున్నది ముఖము.

భామ:- కను లెఱ్ఱగా యున్నవేమే ?

హా :- రాత్రులందు నిద్దుర యుంటేగా? ఎప్పుడూ సత్యభామా - సత్యభామా యని ఒక్కటే స్మరణై పోయె!

భామ:- ఓయమ్మ! అధర మటులున్నదేమే ?

హా :- ఎప్పుడూ చెట్లు చేమలు పట్టుకు తిరుగుటయేగా మనవాడి పని.
అది లేదూ-భల్లూకం-ఆ జాంబవతి-జాతిచేష్టలు పోనిచ్చినదికాదే!

భామ:- భుజములటు లున్నవేమే ?

హా :— ఎత్తరాని బరువు లెత్తుతాడాయె. వద్దంటే వింటాడా పెడతాడా ? చద్దిమూటలు కట్టుకుగట్టి మోసేవాడు గాదూ—కాయలు కాచినాయి.

భామ:- ఆ యమ్మా! వక్షస్థల మటులున్నదేమే ?

హా :- ఒకరా—యిద్దరా? అష్టభార్యలు — పదియారువేల గోపస్త్రీలాయె. ఎప్పుడూ పిల్లంగోరు యూదుతూ యుంటాడే! నిజంగా మన రాజ గోపాలుడేనే !

భామ:- ఉ. ఎన్నడు రానివాడ విపు
డేటికి వచ్చితి వేమి కార్యమో
కన్నెకు నీకు నల్కలను
గల్గిన నాపయి ప్రేమ బుట్టెనో
చిన్నతనంపు ముచ్చటలు
చిత్తమునందు తలంపు బారెనో
విన్నప మెల్లి మాని పలు
వింతలు దెల్పర ప్రాణవల్లభా॥

కృష్ణ:— చ. మన మరయం దలంచి యొక
మార్గమున వన్నితొ నవ్వులాటకో
నను వెరపించెదో — అకట
నాయెడ నిక్కము తప్పు గల్గెనో
వనజ దళాయతాక్షి పగ
వాడనె నన్నిటు లేల జూడ నా
క్క నిమిషమైన నీవు దయ గ
గ్గొనకుండిన నిల్వ నేర్తునే॥

— (తిమ్మన)

-: ఖమాస్ - ఆది :-

కోప మేలనే కోమలి నాపై ॥కోప॥

అ. ప. రాజగోపాలుడ - రాజవదన నాపై ॥కోప॥

1. నిను బాసి కంటికి — నిద్దుర రాదు
నిమిషమైన గాని - ప్రొద్దు పోదు
ఏనసిన మరుబారి - కోర్వగరాదు
యిక నా తమి నిలుప - వశము గాదు ॥కోప॥

2. బాళి నెంతో తరుణి యీవేళ
తాళలేను నాపై దయదాచిన మేలా
బాల నన్ను కరుణించి. లీల
యేలుకొమ్మంటే యీ జాగు లేల ॥కోప॥

— (క్షేత్రయ్య)

# మర్మాల పట్టు

భామ:- అబ్బో యెంత వగలమారివి? ఆ వంశీకుడవు గావూ?

సీ. నీ తల్లి నెరుగమా నీకు చన్నియ్యక
పరుల కొంపల దోలె బ్రతుకు మనుచు
నీ తండ్రి నెరుగమా నీతి నీమము లేక
కసికందుల బలిగ కంసు కిచ్చె
నీ యన్న నెరుగమా విగిడి నాగలి బూని
శరధి గల్పగ బూనె కరిపురంబు
నీ చెల్లి నెరుగమా–నెరజాణ సన్యాసి
వి–మరులు గొల్పిన నీలవేణి

గీ. అట్టి తలిదండ్రి రాగాలపట్టి గావె
మాట లిచట–చేత లచట–వీటబుచ్చి
యచట జేరుట పరిపాటి యామె–నొకరి
ననిన ఫలమేమి–నా వ్రాత యంచు వగతు॥

కృష్ణ:- దండనార్హుడు నీ యెదురనుండ అపరాధ పరిశోధన లేల ?

సీ. అపరాధి శిక్షింప యధికారమును బూని
కరవల్లికల తోడ గట్టరాదె
నీతిపథానపు నీతుగా జేయంగ
అధర మెంగిలిని జేయంగ రాదె
చెప్పుచేతలలోన ముప్పు వాటిల్లగా

కుంభ కుచములనన్ గ్రుమ్మరాదె
మరియాద పోనాడి మనరాదు నీ వంచు
మకరాంకు కేళిలో మాన్పరాదె

గీ. చిగురు మామిడాకు చురనుజేసి-మల్లె
మొల్లల-విరజాజి శిలను-ముదముతోన
శోక వనిలోన-కడతేర్చ-మోకరించు
యేల? జాగేల? శిక్షింపవేల? బాల!

—: దర్వు – దేవగాంధారి – ఆది :—

భామ:- ఎన్ని నేర్చినావురా – రాజగోపాల ॥ఎన్ని॥

అ. ప. విన్న మొన్నటిలోనే-నెరజాణవైతివావు ॥ఎన్ని॥

1. టక్కులమారి రుక్మిణి-గ్రక్కున రానిచ్చెనా
పెక్కు మాటలేల-నిక్కము దెల్పర సామి ॥ఎన్ని॥

2. జిత్తులమారి రాధ-పొత్తు వీడెనే
అత్త యనియైన సుంత-చిత్తమున దోచద సామి ॥ఎన్ని॥

3. భల్లూక తనయా నిను-పారదోలెనే
కల్లలాడక నాతో-తెల్లముగ తెల్పర సామి ॥ఎన్ని॥

కృష్ణ:- సాత్రాజితీ! యిటు చూడు, శబాస్—నీ వచోవిలాసంబులు-వెల్లి
లెత్తించు గదా!

సీ. అలుకలోనైన నీ పలుకులు వినినంత
రుక్మిణి కులుకులు రోతబుట్టె
మూతి విరుపుల నీ ముఖము జూచినయంత
రాధను జూడ చిరాకు బుట్టె
బొడు గరచిన నీ యధరమున్ గన మిత్ర
విందను-జూడంగ-వెగటు బుట్టె

అరుణమైయున్న నీ హరిణాక్షముల జూడ
ఛిద్రను జూచిన వాంతి బుట్టె

గీ. వేలు పదియారు గోపికా వెలదులెల్ల
నీదు నఖముల కెనరారు నిజము చెప్ప
బాస జేతు నీ పరమేశ పదములాన
సరసమాడగ రావె యో సత్యభామ॥

భామ:- సత్యనందుశవన్న ముందు విన్నే పేర్కొనవలయును.

సీ. గుడజీర మిశ్రమున్ గురుతుగా శిరముపై
బెట్టు ప్రమాణమే విపిన మేగె
కాడి సూత్రాన జారెడు వయస్సు శపథ
మే గంగ గలసె నీ కెరుక గలదె
అగ్నిసాక్షిగ పీడనంచును ముమ్మారు
యజ్ఞేశు మ్రోల నీ వనవే మున్ను
ధర్మేచ-కామేచ-అర్థేచ-నాతిచ
రామి యవి మరువ యేమనందు

గీ. బోవి-మాంగల్య తంతునా నేన యనుచు
ను-మమ జీవన హేతు వనుచును-తాళి
గట్టిన యపుడు బల్కవే! అట్టి బాస
లెల్ల కల్లజేయగ నీకె జెల్లె వయ్య॥

కృష్ణ:- ఒక్క సామాన్య సుమమునకై నీకి బేలతనం బేల?

గీ. నేర్పుగా రుక్మిణి యల మునీంద్రు గొల్చి
పారిజాతము న్గొనె గాదె-బరవశమున
దారి జూపెనే గాదె వైదర్భి మున్నె
కొద్దితన మేలనే నీకు కోమలాంగి॥

భామ:- ఓయమ్మా! వింటివా వీని పక్షపాతము?

హా :- అయ్యో! అయ్యో! ఎంత మాటన్నాడే? ఎంత మాటన్నాడే? ఆ మద్దు మందులన్నీ తలకెక్కినాయే తల్లి. మొదలే మొరపెట్టుకున్నా నా మాటలు వింటావా? పెడచెవా?

భామ:- ఉ· నే నట కొద్దిదాన నట
నేర్పరి గానట—ఆడవారిలో
తానట వింధ్య ప్రౌఢ యట
దాని ప్రతాపము చెప్ప శక్యమే
కానగవచ్చె నెల్లరకు
కాంతలపై తమ పక్షపాతమున్
మానగలేవి నీదు యభి
మానము న్యూనము గాక బోవునే॥

ఉ· ఇంతి భవిష్య మేమి——అది
యెంతటి మానిసి—దాని జూచి—నీ
కెంత బడాయి యయ్య—మది
కింతయు సిగ్గు జనింపదో—అదో
నంత గయాళి—నీవన—ని
జంబుగ—గారడి వాడవైతి—వా
గంతకు తగ్గ బొంత—సరి
గా యొనగూర్చె—విధాత—హేలతన్॥

ఉ. విందల కెల్ల నేనే గద
నీ వల పావల యింతిపై గదా
సందడి కెల్ల నేనే గద
జాగర మంతయు నామెతో గదా

యెందుకు పాపజాతి విధి
నేమని దూరుదు—యింటి చెట్టునే
మందుకు నొల్లరయ్యా—యిక
మాటలు కోటలు దాటు-అక్కటా॥

—: దర్బు — ఖండచాపు — ఆనందభైరవి :—

భామనా-సత్య-భామనా ॥భామ॥

అ. ప. భామనా — నా పేరు అల్ల
భామ రుక్మిణి యనెడు నీ
అభిమానమును దీయించి
నలుగురిలోన కా దనిపించకుంటే ॥భామ॥

1. యెందుకుర తాళరా
విన్నేమందురా-ఆ మిత్రవింద
తంత్రములు తలకెక్కెనని
పదిమందిచే బలికించకుంటె ॥భామ॥

2. హద్దు పద్దు లేక యా
భద్ర మాటలు విన్న నిన్ను
బుగ్గలు నులిమించి నీ కిది
బుద్ధి గా దనిపించకుంటె ॥భామ॥

3. కష గట్టిన లక్ష్మణకు
తాకట్టుగా నిను గూర్చి కసితో
లేమ లెల్లరు చూడ జడతో
వేమరు నిను గొట్టకుంటె ॥భామనా॥

కృష్ణ:- మ. పగవాడై మరుడేయు క్రూర శరముల్
బాధించ ఘోరంబుగా

వగపున్ గొల్పుచు—మ్రుక్కి పల్కులను—నీ
వాళించి - గేల్జేసి - నొ
వ్వగ జేయన్ తగునే-క్షమించి నను బ్రో
వన్ రావె-కేల్మోడ్తు-పోన్
తగవుల్-దాసుని తప్పు చెల్లును గదా
దండంబుతో సుందరీ॥

భామ:- ధూర్తుడా! (కాలు పట్టుకోపోతే యూడించింది)

కృష్ణ:- సీ. గోప బాలుర గూడి — గోవుల గాచుచు
కొండెనై —ఒట్లను గొట్టునాడు
రాసక్రీడల జొక్కి—రాధికా రమణితో
జలక మాడెడు సరసాలనాడు
బావయౌ రుక్మి—కంబష్ట కుందనయి న
తిమణి రుక్మిణి దెచ్చునాడు
కేళికి రమ్మంచు-కీరవాణుల చాటు
చీటుల దూతికల్ జేర్చునాడు

గీ. కొసరి తలబ్రాలు మనము చేకొనిన నాడు
వేల్పుటువిదలు సేసలు వెట్టునాడు
నీ ప్రథమ సమాగమ కేళి నేర్చునాడు
కలికి! నేటి యానందమే గలుగదయ్యె॥

సాత్రాజితీ! హృదయ రంజకంబాయె!

చ. నను శివదీయ దాసుని మ
వంబున నెయ్యపు కిన్కబూని తా
చిన యది-నాకు మన్ననయ
చెల్వగు నీ పదపల్లవంబు—మ

త్తనుపులకాగ్ర – కంటక – వి
తానము దాకిన నొచ్చు నంచునే
ననియెద–నల్క మానవుగ
దా యికనైన – నరాళకుంతలా॥
— (తిమ్మన)

—: దర్వు – ఖమాస్ – మిశ్రచాపు :-

కృష్ణ:- కర్పూర గంధితో–కలయుట లేదని
నిప్పులైన బట్టెద ॥క॥
భామ:- కారుచిచ్చు బట్టి–కబళించు వానికి
నిప్పు లనగ నెంతరా ॥క॥
కృష్ణ:- ఆ వనజాక్షితో–నెనయుట లేదని
గోవు నంటుకొందునా ॥ఆ॥
భామ:- యే వేళ గోవుల గాచేటి వానికి
గోవు లనగ నెంతరా ॥యే॥
కృష్ణ:- ఆ కలకంఠితో గలయుట లేదని
పామునైన బట్టెద ॥ఆ॥
భామ:- పాముమీదను జేరి సాముజేయు వానికి
పాము లనగ నెంతర ॥పా॥
కృష్ణ:- ఆ విరిబోణితో గూడుట లేదని
దేవర గుడి జొత్తునా ॥ఆ॥
భామ:- దేవ జాతరలు–దిగ్భ్రమింగు వానికి
దేవ రనగ నెంతరా ॥దే॥
కృష్ణ:- నమ్మి నా తల తడిపి–బాసజేసిన గాని
నమ్మ వేమి సేతునే ॥న॥

భామ:- కొమ్మ చన్ను గుడిచి—కొమ్మ గుద్దినవాని
నమ్మవచ్చు నటరా ॥కొ॥

కృష్ణ:- ఉ. ఓ లలితేంద్ర నీలశక
లోపమ కైశిక—యింత వంత నీ
కేల? లతాంత మాత్రమున
కే-గలుగన్-విను నీకు దేవతా
కేలి వనంబు జొచ్చి యని
కిన్-బలసూదను-దెత్తి వచ్చివన్
దీలు పడంగ దోలి యిటు
వెచ్చెద-నిచ్చెద-పారిజాతమున్॥
— (తిమ్మన)

గీ. వామలోచన-నీ కేళి వనములోన
జలువ వెదజల్లు—చెంగల్వ కొలని కెలని
సరస కర్పూర కదళికా తరుల నడుమ
బెరటిచెట్టుగ నాటింతు బెంపు గనుమ॥
— (తిమ్మన)

భామ:- ఓయమ్మ! స్వామివారిని బంగరు పూవుల పూజింతమమ్మా!

-: ఆనందభైరవి - త్రిశ్రచాపు :-

1. బంగరు పూవుల పూజసేతు
శృంగారముగ కన్నుల నిండా జూతు
చెంగల్వ పూదండ వేతు
కూచిపూడి రాజగోపాలా
గ్రుచ్చి కౌగిలియరా ॥బంగరు॥

2. చందనాది లేపనముల
సందముగా జేతు
కస్తూరి తిలకము — నొసట గిలింతు
కర్పూర హారతుల — కై దండ లిడుదు ॥బంగరు॥
తొత్తా — దిగి దిగి — దాత్తాం — ద ది గి ణ తోం
తాం ద ది గి ణ తోం
తై ద ది గి ణ తోం

—: గద్యము :—

శ్రీమన్మహా మహేశ్వర - కూచిపూడి రామలింగేశ్వర-రాజగోపాల దివ్యపద పద్మారాధక శ్రీ కూచిపూడి నృత్యకళా వతంస - హరిత సగోత్రోద్భవ-వేదాన్త వంశ పయః పారావార రాకా సుధాకర సౌభాగ్యవతీ గర్భసూక్తిముక్తాఫల-శ్రీ వేంకటాచలపతి యజ్వ-తృతీయ పుత్ర - నృత్యాచార్య పార్వతీశ శాస్త్రిపూరిత శ్రీ సిద్ధేంద్ర కృత భామా కలాపంబును — నృత్యరూపంబు సర్వము సంపూర్ణము॥

శ్రీ రా మ శ ర ణ మ్

***

# దొ ది న మ్మ వే ష ము

***

[ కర్ణకరుడు దొంగ – మంచము నెత్తిన పెట్టుకొని ప్రవేశము – కారదవి ]

–: దర్వు – త్రిశ్రగతి :–

కర్ణకరుడు :– కర్ణ కరుడరా – నే చోరులకు సర్దారుడరా ॥కర్ణ॥

అ. ప. కన్నాన పోయి – కన్నార్పి యీ రేయి
కంటిరా యీ శాయి – తెచ్చితిర యీ తాయి

1. ఏడు కోటల దాటి – షేడ మిద్దెల వాటి
ఒంటిస్తంభ మనేటి – గూటి నుండెర యీ బోటి ॥కర్ణ॥

2. మచ్చుమందులు జల్లి – యుచ్చుయురుల నల్లి
హెచ్చైన వగ గల్గి – నొచ్చెరా యీ బుల్లి ॥కర్ణ॥

3. మాళవ రాజుకు పెళ్ళాము సేయాలి
ఒళ్ళు కళవళించు – ఓమారు యనిపించు ॥కర్ణ॥

4. టక్కుటమారాది - పెక్కు జిత్తులు నాకు
దక్కెరా గజకర్ణి -గోకర్ణి యింద్రజాలి ॥కర్ణ॥

5. మచ్చుతిప్పెద జూడు - హెచ్చెరాతమి నేడు
దాదిరానమ యీడు - నచ్చెరా నను గూడు ॥కర్ణ॥

దాదినమ్మ:- -: దర్వు — ముఖారిచాపు :-

1. దాదినమ్మ — నే దాదినమ్మ
దాదిలో చిన్నదాన నో యమ్మ ॥దాది॥

2. దొడ్డరాజు బిడ్డనోయమ్మ
పెద్ద దొంగ చే జిక్కితి నమ్మ ॥దాది॥

3. మానధనము గలిగినట్టి
మానవతికి బుట్టితినమ్మ ॥దాది॥

4. వీడు తెచ్చుట యెరుకలేక
అడుకొందు రెల్లవారు ॥దాది॥

5. బందికాడై కర్ణకరుడు
ప్రాప్తమయ్యె యేమి సేతు ॥దాది॥

6. రాజరాజు భోజ రాజునకు
తలవంపులాయె యేమి సేతు ॥దాది॥

7. తల్లిపేరు మానవతి—తండ్రిపేరు భోజరాజు ॥దాది॥

8. అత్తపేరు ఆకూతగా
మామపేరు చందమామ ॥దాది॥

9. మగని పేరు మోహనాఖ్యుడు
నాదు పేరు శీలావతి ॥దాది॥

10. పుట్టకోట భూమికోట
కంచుకోట కల్వకోట ॥దాది॥

11. ఏడు కోటల నట్టనడుమ
వంటిస్థంభం మేడమీద ॥దాది॥

12. పట్టెమంచం పరుపుమీద
పవ్వళించి నే నుండగ ॥దాది॥

13. ఇనుప కోట – యిత్తడి కోట
వెండి కోట వెలసినది ॥దాది॥

14. మాయదారి కర్ణకరుడు
మచ్చుజల్లి నన్ను తెచ్చె ॥దాది॥

15. చెడెనమ్మ – నే చెడెనమ్మ
చెడే యీ చెరలో జిక్కితినమ్మ ॥దాది॥

16. బాలనమ్మ – నే బాలనమ్మ
బాల నపకీర్తి పాలైతినమ్మ ॥దాది॥

—: దర్వు - ఖండచాపు :—

తక తకిట — తక తకిట
బుల్లీ ....యెల్లి మన పెల్లి ॥బు॥

అ. ప. తల్లి వచ్చా చూడు
పెల్లి కొడుకును నేడు ॥బుల్లీ॥

1. బాజాభజంత్రీలు — భ్రమర కీచకగాళ్ళు
సన్నాయి రాగాలు — కోకలీ వలయాలు
భం—భం—భం—భం—భేకకుక్కుట డోళ్ళు
చిలుక రౌతుగాడు - మన పెళ్ళి చేస్తాడు ॥బుల్లీ॥

2. నంజ కెంజాయలు - మన పెళ్ళి దీపాలు
చందురుడు వత్తాడు — చదివింపు లిత్తాడు
మూడు నిద్దురలకు సరివచ్చు పూరిల్లు
అందాక పోదాము రావే బుల్లీ
యీ సందు దొరకదే మళ్ళీ ॥బుల్లీ॥

[ పుంలింగం — భ్రమరం - కీచకం—వెదురుపొద ]

—: దర్వు కీర్తన — శంకరాభరణం ఆది :-

(అనాగత ప్రయోగం)

దాదినమ్మ:- మరియాద గాదు — పోపోరా
మగవాలి జోలి - తగదు....రా ॥మరి॥


అ. ప. పరదార తోటి — సరసాలా
వాలిరియశమౌ నటరా
కారడవిని నను — యేచుట న్యాయమె
కర్ణకరా — దయ గనరా ॥మరి॥

1. ఆలుబిడ్డలు లేరె — అక్క చెలియలు లేరె
జాలిమాలి యిట్లు — మేలములాడ ॥మరి॥

2. మచ్చు జల్లి నన్ను — తెచ్చుట మేలా
పెచ్చురిల్లిన యీ చురయే గతి ॥మరి॥

3. కావగ రారెయో — కారుణ్య మతులార
గజదొంగ చేజిక్కి — గాసిలుచుంటి ॥మరి॥

[ మాళవరాజు వచ్చి విడిపించును. ]



# కూచిపూడి పతాకము

## పతాక వందనము

:- హంసధ్వని–ఆదితాళము :-

వందే వందే వందే వాణీ భవాని ॥వందే॥

అ. ప. వాణీ భాషా యోషిత గీర్వాణి
వీణా వినోద పాణి
....నటరాణి – కోకిలా వాణి — కూచిపూడీ రాణి
॥వందే॥

కల కల లాడే కళా సౌధములు
విలసిత సౌరభ యశః కాంతులు
సలలితమా నీ—నృత్య గానముల
ఆలాపంబుల కాలావాల మిదె ॥వందే॥
బాలా! సామ గాన లోలా
చతుర్విధాభి నయ ఖేలా
రామలింగేశు ధేలా
షోడశ కళావాల—కూచిపూడీ బాల ॥వందే॥

# కూ చి పూ డి

సిద్ధేంద్రుడు శాలివాహన శకం ౧౧౦౨ ఫసలీ క్రీస్తుశకం 1180 వ సంవత్సర ప్రాంతము వాడు.



గీ. స్వామి సిద్ధేంద్ర నీదగు సచ్చరిత్ర
నెంత కొనియాడుదయ్య – నా యంతవాని
కెట్టు లది సాధ్యమౌను – నా కెరుగ జెప్ప మ
మించు వేదవ్యాసు నిన్ను ప్రార్థింపవాడ

గీ. నీవు భామా కలాపమ్ము నేర్పినావు
దాన నెంతయో కీర్తిని దాల్చినాము
క్రీస్తు ద్వాదశ శతవర్ష క్షితిని గాదె
గజ్జ కట్టించి నేర్పిన కాల మరయ॥

★ అట్టి కథకు విధాన మదెట్టి దనిన ★

గీ. స్వామి సిద్ధేంద్రుడను నొక్క సాధువరయ
నాడు భామా కలాపమ్ము నాట్యగతుల
యక్షగానమ్మునను వ్రాసె నక్షయముగ
నాట్య మాడించి చూడ మనమ్ము వెలసి॥

గీ. క్షేత్ర మెరిగి విత్తనము సంక్షేమముగను
నాటు రీతిని పాత్ర విన్యాస మెసగ
వారణాసి యాత్ర కలసివచ్చు నంచు
జోడు భావంబులను నెల్ల మోపిగలిపి॥

గీ. ఏ మహానది జలముల వింత గ్రుంకు
లిడిన-కిల్బిషమడగు—నా కృష్ణవేణి
కుపనది యగు-భీమనదియు యుద్భవించె
నాడు భీముడు-గద జాప్పె నడువనంద్రు॥

గీ. స్వామి సిద్ధేంద్రు డల్లన భీమనదికి
చేరువకు వచ్చి—విశ్రమించెను-శ్రమంబు
దీర-యప్పుడు వినె నతండు—దివ్య సామ
వేద—గానంబు కోయిలల్ వినుచునట్లు॥

గీ. సోముగేరేడు — మోముల సోయగంబు
నాటి వామనరూపమేన్న దగువారు
చిలుక పలుకుల బలిపించు పలుకు బలుకు
చున్న బాలుర నలువుర జూచి యతడు॥

గీ. నాల్గు మోముల వానినే నాట్యమాడ
జేతు రీ వటువు లరయ-క్షేత్ర మిదిర
యంచు-సమ్మోద మంది-అయ్యారె — వీరె
తనకు కోర్కెలు దీర్పంగ తగుదురంచు॥

గీ. మోదు మనమున తలపులు మోసులెత్త
అదటో తీర్థమే నెదురైన యట్లు
వాద జాడలు తెలియంగ వాంఛ గలిగి
చేరబిలిచియు-వారిని—సిద్ధుడంత॥

గీ. వినుడు నా తండ్రులార యీ వేళ మీర
లేలరా కారణంబు-మీ రెందు నుండు
రయ్య — మీ రెవ్వరయ్య - మీ నెయ్యమిపుడు
వలయు — మీతోడ వత్తు మీవాడ కవిన॥

గీ. ఒకరి మొగములు నొకరొక్కరోగిని జూచు
కొంచు — గుసగుస చెవి బల్కి-కొంచు-వంచ
కదో-మంచివాడో-యెవరు గానగుం ర
టంచు చింతించి స్వామితో నని యట్లు॥

గీ. అల్లదే చూడుము గురుకులాశ్రమంబు
కూత పరువున నుండెను—కూచిపూడి
యనగ - కృష్ణుని చెలిమి కాడట కుచేలు
డుండెనని చెప్పుకొందురు మా యూరి బుధులు॥

గీ. రండు మాతోడ గలసి విరాన జేర
గలము — జాగాయె — మావారు - కారణంబు
దెలియక చికాకు బడుదురు—దినకరుండు
బరుగిడుచునుండె నాకాశ పథమునందు॥

గీ. అంచు సమిధల మోపెత్తికొంచు నడువ
దంచు మా గురువు దయాళుడంచు సోమ
యాజి యంచు - మా దేవాలయంబు నందు
విశ్రమించు డంచును జేరి రాశ్రమంబు॥

గీ. హోత లెల్లరు వరుసగా యుపనిషత్తు
ల పఠన సలుప — స్వాహాలు రమ్య నాద
ములు చెలంగ — హోమ మొనర్చు ముదము మీర
భామ సమిధల నందీయ సోమయాజి॥

గీ. జాతవేదుని జ్వాల సంచలన మెపుడు
ఋత్విజుల స్తోత్రములను కేరింత లాడు
నంచు పంచాగ్ని కీల క్రొమ్ముంచు వెనసె
యుల్లము మఱెరెడు వేదకలెల్ల జూడ॥

గీ. యజ్ఞయాగాదు లొనరించు ప్రాజ్ఞులెల్ల
కదురు - పదుకుదు - ఘన - జటా - గానములను
కార్యదీక్షల జొప్పించి కరువులేని
జీవయాత్ర సాగింత్రు సద్భావమునను॥

గీ. సామగానము విని మది సంతసించి
సోమయాజుల నెల్లర జూచి జూచి
అల్ల రఘురాజు పాలనం బౌర యంచు
సార్థకత జెందె కృతి యంచు స్వామి మురిసి॥

గీ. రామలింగేశు నాలయారామమందు
విశ్రమించెను రెండవ విశ్వకర్త
యనగ - నెగడున్న యునికి నేమన గలము
నివురు గప్పిన నిప్పు నెన్నిన విధంబు॥

గీ. భేద బుద్ధియు లేకింత సాధుజనుల
నతిథి నభ్యాగతుల పూజనర్థి జేయు
బాష్యముల శిష్యకోటిచే పలువిధముల
సంత వేయించు నాశ్రమాచార్యు డొకడు॥

గీ. సంతవేయుచు శిష్యులు వెంటరాగ
అల బృహస్పతియా యేమి? యనుకొనంగ
పండుమోమున చిరునవ్వు పరిఢవిల్ల
భిక్షకై బిల్వవచ్చి సాపేక్షతోడ॥

గీ. స్వామి సిద్ధేంద్రు పదముల సొగి(మ్రొక్కి
నాదు జీవిత మెల్ల ధన్యమ్మొనర్ప
భిక్ష గై కొన (బ్రార్థింతు పేర్మితోడ
నంచు నెంతయు నుతియించె మింపుమేర॥
గీ. స్వామి భిక్షకు సపరాహ్ణ సమయమందు
వేదపారాయణము జేయ వేగ రండ
టంచు బ్రాహ్మణ్యమున్ జీరె యంతకంత
కతిధి పూజలు మనసునన్ దావహింప॥
గీ. మెండు గాలికి పైకొటి తాండవింప
దండమరచేత సువిలసితమ్ము గాగ
అపర శంకరుడన స్వామి యపుడు లేచి
మమత వేంచేసె నాచార్య మందిరమును॥
గీ. స్వామి పాదంబు కడిగియు సరస జేరి
సురటి వేయుచు ధన్యుండ సుకృతి నండె
నంచు నాచార్య డాపోశనంబు నీయ
స్వీకరించక భీష్మించె సిద్ధుడంత॥
గీ. ఎల్లవారలు విభ్రాంతి నింత దవిలి
యేమి యపరాధమాయెనో యెరుగలేక
తహ తహంబడి యేమేమొ దలచి తుదకు
వినయ మిగురొత్త బల్కిరి విమలమతిని॥

గీ. స్వామి! యపరాధ మేమిటి? శంకలేక
దెల్ప వేడెదమయ్య ఓ దివ్యచరిత
కేలు మోడ్తుము మము నాలకింపు డిపుడ
టంచు ప్రార్థింప నవధూత యనియె నిటుల॥

గీ. వేదవిదులార మామక విరచితమయి
నట్టి భామా కలాపమ్ము నాడి పాడ
నివ్వ దలచినాడను నా యభీష్ట మిదియ
మీరు నాట్యమాడగ జూడగోరినాడ॥

గీ. వాడ వాడల వెతక నెవ్వారుగాని
తగు సమర్థులు దొరకమి తల్లడిల్లి
మిమ్ము గాంచితి నేటికి — మీరు సమ్మ
తించకున్నదిన-నను గమనించుడన్న॥

గీ. విన్నవారల మోములు చిన్నవోయి
కన్న మాకున్న కీర్తి పోకున్నెయంచు
మన్నుపాతాను-బ్రాహ్మ్యము సన్నుతింతు
పున్నెముండును భజియింపుమన్న మౌని॥

గీ. సంశయంబుల దీర్తు మీ సరసనుండి
చింత వీడుడు మీరలు చిత్తమందు
భగవ దనుమతమౌ నీ ప్రబంధ రచన
పాడియాడుట విప్రులపాలి సొమ్ము॥

గీ. కోర్కె దీరక దినమంచు ఘోర దీక్ష
బట్టినాడు పాలింపకున్నచో శాప
మిన్న బ్రాహ్మ్యంబు బోవు దైవేచ్ఛ దాట
నెవరి తరమంచు దురపిల్లిరెల్ల వారు॥

గీ. తప్పదంచును చివరకు నొప్పుకొంచు
స్వామి మీ కోర్కె దీర్తుము సంశయంబు
వలదు కావిం డనగ యతివరుడు మెచ్చి
భిక్ష గొనియెను నిజకార్యదక్షు డగుచు॥

గీ. కాలయాపన జేయక బాలురకును
వేడ్క సుముహూర్తమున భామ వేషమాది
యాటపాటల మొదలిడె యతివరుండు
కాలచక్రము ననుకూల గతుల నడిచె॥

గీ. ఒకనికిని కృష్ణవేష మింకొకని భామ
వేషమున తీర్చిదిద్దెను వింత గొలుప
ప్రక్కపాట కాచార్యు నభ్యాస పరచె
నాల్గు మాసాల పూరించె నాట్యశిక్ష॥

గీ. ప్రక్క పల్లెల జనులతో నిక్కటిల్లి
నాశ్రమంబున నొకనాడు నాట నడిపె
సత్యభామయు కృష్ణుని సరసములను
విన్న ప్రేక్షక తతి కతి వింతగొలుప॥

గీ. ఎంత చక్కగ నాడిరి వింత దోచె
నంచు బల్కువారును యిట్టి ఆట నెరుగ
మంచు జింతించువారును — ఔర! మనదు
పూర్వపుణ్యంబ యిది యని పొగడువారు॥

గీ. ఐరి—యచ్చోటి ప్రేక్షకులంత స్వామి
దగ్గిరన జేరి సిద్ధేంద్ర తమరు నాట్య
కళల దనిపించితిరి మమ్ము గాన మేము
మీదు ఋణమీగ నెటులని మించు వేడ్క॥

గీ. సోమయాజు లెల్లరు కడు చోద్యమంది
మనమునన్ గల శంకలు మరచిపోయి
ధన్యతన్ బొందె నౌర మా తనువులంచు
స్వామి సిద్ధేంద్రు పదముల సాగిమ్రొక్క॥

గీ. నాదు కోర్కెను నెరవేర్చినారు మీ మ
నంబు నిస్సంశయము జేయ నాకు మిగిలె
శంకరాచార్యునకు జూపి సంశయంబు
దీర్తు — దీక్షయు నాటితో తీరగలదు॥

గీ. పంపుడయ్య మీ తనయుల భయము లేదు
అల్ల పీఠాధిపతులకు నెల్ల జూపి
యెల్ల వారి మనోభీష్ట మెల్ల గొనియు
నారు నెలలకు నేతెంతు ననియె స్వామి॥

గీ. మీకు నిష్టమౌ రీతిని మెలగుదయ్య
మా మనంబుల శంకలు మాసిపోయె
మందమతి మేము బల్కిన మాటలెల్ల
మరచిపొందని వారు సన్మైత్రి బలికి॥

గీ. ప్రక్క పాటకాచార్యుండు బయనమాయె
శిష్యులెల్లరు వరుసగా చెంతనుండ
నాట్య రమణీ స్వయంవరణంబు గోరి
వెడలె భూసురు లాసీస్సు లిడుచు నుండ॥

గీ. సర్వ మతముల వారికి సామరస్య
భావమే పారజేసి సబాంధు వనగ
పేరు గాంచిన శృంగేరి పీఠమునకు
శిష్యవర్గము వెంటరా జేరె గురుడు॥

గీ. శంకరాచార్య బదముల సాగిమ్రొక్కి
భక్తి కేల్మోడ్చి తనదు ప్రబంధ రచన
యక్షగానంబు వినిపించి యవల నాట్య
మునకు సెలవీయ నడిగెను వినయమునను॥

గీ. వల్లెయని శంకరస్వామి బల్కినంత
పట్టరానంత సంతోష ముట్టిపడగ
నేటి రాత్రికి యాటంచు మాట జెప్పి
శిష్యులకు వేషములు గట్ట సిద్ధపరచె॥

గీ. తాం తకిట తాం తకిట తోం తధై యనుచును
స్వామి తవ తాళగతుల ప్రసారమీన
చెంతనున్న నాచార్యుడు వంత బాడ
సభకు నేతెంచె తెరదీయ సత్యభామ॥

గీ. వాస సజ్జిక నాయిక వదన ముచ్చ
ట దెలుప కలహాంతరిత మాటలను గోచ
రింప ఖండిత భావంబులెల్ల జూపి
"భామనే" యంచు దరువునుబట్టి పిదప॥

గీ. కృష్ణు డెంతకు రామికి కినిసి సత్య
రాయబారము నంపుట రాక తదయ
మూర్ఛ నొందుట రాగనే మూతి విరచి
ప్రణయమున తన్నుటాదిగా పాడియాడ॥

గీ. శంకరుని దేహ ముప్పొంగి సర్వనముడు
కృష్ణపరమాత్మ వచ్చెనో క్రీడ సలుప
తాను ద్వారక నుండెనో తలపలేక
కలియె ద్వాపర మయె నంచు కలతపడుచు॥

గీ. గర్గుడంచును నాచార్యు గణుతి జేసి
ఉద్ధవుండని సిద్ధేంద్రు నొద్దకేగి
గ్రుచ్చి కౌగిట జేరిచి మెచ్చి బలికె
నీవె శ్రీకృష్ణు చెలికాడ వింత యేల?॥

గీ. అంచు ధన్యుండ వీవంచు నౌర నీవు
పాడ కృష్ణు డిటుల నాట్యమాడ నెట్టి
తపమున వొసగె మీ కిట్టి తగిన పొత్తు
టంచు నెంతేని పొగడుచు మించు వేడ్క॥

గీ. అంత్యమున వారి మంగళహారతులను
వందిమాగధ బృంద కైవార మటుల
నోప కలగంటి నింక నిదుర తగదని
తెలివి నంది నాట్యమనియు తెలిసి మురిసె॥

గీ. వింటి ద్వాపరమున నిటువంటి కథల
కంటి నీ కంటితోడ నా జంట నిపుడు
యెంత వాకొన్న తరుగదీ వింత కళయు
నెట్లు నేర్చినారో వీరలిట్టి యాట॥

గీ. అన్న! సిద్ధేంద్ర యిటు విను మాది కాల
మందు కృష్ణు డిటుల జేసెనందు విందు
గాని గాంచి యెరుగ నీదు కావ్యమందు
దెలియ గల్గి ధన్యుడనైతి దివ్యచరిత॥

గీ. ఎట్టి తపముల సిద్ధించె నిట్టి కావ్య
రచన ముక్తియు హస్తామలకము నీకు
నౌర! మరపించి దోబూచులాడె నాతో
నీదు జన్మసార్థక మందె నిజము నిజము॥

గీ. బాగు బాగని యతియును బల్కుచుండ
స్వామి సిద్ధేంద్రుడంత నా స్వామి తోడ
నటుల పంక్తేయులంచును నలువురాడు
శంక దీర్పగ వలతన శంకరుండు॥

గీ. పక పకాలున నవ్వి పాపంబు గట్టు
కొనరె నటులన్న వీరిని కోవి బాళి
ముక్తికాంతను వలపించు శక్తియున్న
వీరికిని సాటి భువిలేరు – లేరు — లేరు॥

గీ. నాల్గువేదాలు పఠియించినను నొరులకు
ముక్తి గూర్పలేరు నిజము–భక్తి విష్ణు
నామముల మేళవించియు నాట్యమునను
జూప వీరలేమునులైరి జూడ నాకు॥

గీ. అన్న! సిద్ధేంద్ర నీ మదినున్న నంది
యంబును విడువుమయ్య నా యభిమతంబు
శాసనంబు గైకొనుము–రక్ష–యని తామ్ర
శాసనంబును లిఖియించి సనదు నిచ్చె॥

గీ. శంకరస్వామి తన కిడు శాసనంబు
పెన్నిధిన్ గన్న పేదగా ప్రీతి నంది
కొనియు కండ్ల కద్దికొనియు కొరత దీరె
కృష్ణపరమాత్మ దివ్యమౌ కృప నటంచు॥

గీ. సంతసంబున సెలవంది శాసనంబు
నెల్ల పీఠాధిపతులకు నెల్ల జూపి
వారి మన్ననలన్ బొంది చారుగుణుడు
గురుడు శిష్యులతో జేరి కూచిపూడి॥

గీ. క్షేమమే గద "సోమయాజి-యవధాని
క్షేమమే-చైన్లు-పాకయాజి-సుఖమౌనె
పరగ మీ క్రతువులవియు పరిసమాప్త
మందెనే యంచు-పేర్వేర నడిగె బుధుల॥

గీ. మీరు లేకెట్టులగు స్వామి! మీదు రాక
వేచియుంటిమి మా కిలవేల్పు నీవె
గావె! పర్యటనంబున గన్న ఫల మ
దేమొ వినిపింపుడన స్వామి యిటుల బలికె॥

గీ. శంకరాచార్యునకు జూప సంతసించి
తామ్రశాసనం బిచ్చె మతగురువులగు
వారి యభిమతమౌ యానవాలు లివిగొ
చూడుడయ్య మీ రెల్లను చోద్య పడక॥

గీ. వీరె మీ తనయు లివిగో వీరి నాట్య
మునకు నిచ్చిన శాసనములు మనోగ
త మృదుభాషణములు సంతత సుఖతోష
ణము లటంచు జూపనట నున్నట్టివారు॥

గీ. స్వామి! మీ ఋణ మెటు తీర్పఁజాలు మాకు
నెన్ని జన్మాల తీరునో యింత పెట్టు
బడియు నే రీతి సరియౌనొ బయలు పరచి
ధన్యజీవుల జేయుమో తాపసేంద్ర॥

గీ. అనుడు చిరునవ్వుతోడ నా యతివరుండు
నవియె వారల కిట్టుల అన్నలార!
తరతరంబుల మీరలు భరతనాట్య
మాడి పాడుచు తరియింపు డదియు గాక॥

గీ. బిడ్డ పుట్టిన నాడగు పేరు జెప్పి
ముక్కు కుట్టింపుడయ్య సమ్మోద మలర
కాలికిన్ గజ్జ కట్టించగలుగు నపుడె
నాదు ఋణమీగ గలరు యే నాటికైన॥

గీ. తెలుపు దొక్క రహస్యంబు తేటపడగ
వినుడు ప్రతి శుక్రవారము విమల మతిని
ఆలయమునందు మీరలు నాడి పాడ
గలుగు ముక్తియు భుక్తియు గాలుగడువ॥

గీ. అనుచు సిద్ధేంద్రుదుస్ బల్కినంత సంత
సించి వారలు తమ క్షేమ మెంచి పల్కు
నుదుల శిరసావహించిన కడకు స్వామి
కాశియాత్రకు పో సమకట్టి నడువ॥

గీ. కంట నీర్వెట్టి వెనువెంట నంటి నడచు
వారు యాత్ర ముగియగ మా వాడ జేరు
డంచు ప్రార్థించు వారునునైన జనుల
భక్తి భావం బదెంతయో పలుక వశమె॥

# అగ్రహారోత్పత్తి

శాలివాహన శకం ౧౧౫౪ ఫసలీ — క్రీస్తుశకం 1232 వ సంవత్సరము

గీ. ఇట్టి కథ యున్న రోజుల నీ ప్రదేశ
మెల్ల బాలించు శానీష యుల్లమందు
దలచె బందరు కోటకు దాను వెడల
నంత సైన్యసమేతుడై యరుగుదెంచె॥

గీ. అంచె లంచెల మజిలీల నచట నచట
నుండి తన యేలుబడి క్రిందనుండు భూము
లెల్ల నజమాయిషీల్ జేసి యేగుచుండ
కూచిపూడికి రాగనే క్రుంకె ప్రొద్దు॥

గీ. తనదు ప్రియురాలు విరహాగ్ని తప్తయౌట
అల్ల పవనుండు దెల్పిన యుల్ల మలరి
పింజమబ్బుల తెరదీసి సంశవేళ
చెట్లచాటుగ తిలకించె శీతకరుడు॥

గీ. అకట! యిది యేమటంచును ముకుళ పద్మ
కన్య తన నాధుకై యేడ్వ కలువకన్నె
వికసితోజ్వల వదనయై వెక్కిరించె
తనదు పతి రాక చూచుక మనసు పొంగి॥

గీ. అలసిపోయిన పరివారములను జూచి
పయన మాపగ సుల్తాను భటుల హెచ్చ
రింప డేరాల వేసి నా రేయి నిదుర
నుండ రెండవ జామేగు చుండినంత॥

గీ. మధుర మధుర స్వనంబులు-మృదుల ధ్వనుల
మారు బల్కెడి మద్దెలల్-మరపురాని
చిరుత గజ్జెల మ్రోత విశేషములును
వినియె సుల్తాను డవ్యక్త విధిని నపుడు॥

గీ. దిగ్గునను లేచి పరికించి తిమిర తతుల
గాంచి తెలవార దంచు యోచించి మదిని
మరల శయనింప బోనంత మారుమ్రోగు
ధ్వనులు తన్బిల్చుచున్నట్లు దలచి లేచి॥

గీ. భటుల లేపక తానంత పయనమాయె
తనకు వినబడుచుండిన ధ్వనుల కొరకు
యెవరి కర్మంబు గాలెనో నిపుడటంచు
కాగడాల్ బట్టి భటులును కదలి నడువ॥

గీ. కొంత దవ్వేగ గన్పట్టె కోలవెలుగు
నాట పాటలు చతురోక్తు లమిత జన స
మూహ కోలాహలం బతి ముమ్మరముగ
వినబడంగను వేమరు వింతబడిరి॥

గీ. భూత భేతాళ గణమేమొ భూన భోంత
రాళ మదరంగ నాడు నీ రాత్రి మనదు
పీకలే నొక్కునంచును బెదరి చెదరి
చేయునది లేక భటులెల్ల జేరి రటకు॥

గీ. బిరిశ డాల్కత్తి బట్టిన భటుల జూచి
బందిపోటు లటంచును భ్రమసి మదిని
గుంపు గుంపులుగా లేచి గుండె లదర
పరుగులిడు ప్రేక్షకులకోడ బలికె గురుడు॥

గీ. ఏం లేచియు పరుగెత్త నిపుడు మీరు
నిలుడు శత్రుల నిర్జింపగలము మనము
భీరువులవోలె బారిన యూరిపేరు
దక్కునే? కూచిపూడియు మొక్కవోదె॥

గీ. అంచు జనముల నదలించుకొంచు గురుడు
కౌశ బిగియించి రోషసంకాశు డగుచు
నిజము నారసి యతడు తానీషగాగ
ప్రభువు ప్రభువంచు యెలుగెత్తి ప్రకట పరచ॥

గీ. తమ యపోహకు సిగ్గిలి తమకు తామె
వెనుదిరిగి వచ్చి ప్రభుభక్తి వెల్లడించి
రెల్లవారును గురుడంత యుల్లమలర
ప్రభువు నిన్ దోడుకొని చని పందిలికిని॥

గీ. కోరినను రాని తమ యట్టి వార లిటకు
దయను వేంచేయ మా సుకృతంబు గాదె
కృష్ణుడే మిమ్ము రప్పించె క్రీడ జూప
మా యదృష్టంబు పండెనో మాన్యచరిత॥

గీ. కృష్ణపరమాత్ము డితడు రుక్మిణియు సత్య
భామ మున్నగు వా రష్టభార్యలంద్రు
వీరి సిద్ధేంద్రు గురు కృపావీక్షణమున
యక్షగానంబు నాడింతు ననుచు తాను॥

గీ. కేల తాళము బట్టి సంకీర్ణ గతుల
తీరికల నిచ్చి "యెందు బోతి" వను దర్వ్య
భామ నాట్యంబు సేయ సభావయుక్తి
కనుల విందుగ సుల్తాను గాంచి గాంచి॥

గీ. కటిక నేలను నాడంగ కందిపోవు
మావిచివ్రరుల తొలికారు తీవి దెలుపు
వీరి పదములు పరుపులన్ వేగ దెచ్చి
పరచుడన రాజా భటులును భద్రపడిరి॥

గీ. పట్టుబరుపుల వేయుంగ భావగతిని
రాగ తాళానుయుక్త సరాగ గాన
మాలపించుచు నాట్యంబు నాడ తొడగి
రంత సుల్తాను హృద్వన మింత బూచి॥

గీ. కాము యలిగిన తను దానె పరితపించు
విరహ మొందిన తానెంతొ వెరపు జెందు
దూతి కనువేడ తన మదితోడు పంపు
నవరసాకృతి దాల్చె తన్మయత నొంది॥

గీ. ప్రణయ కలహంబు జూచి తా ప్రణుతి సేయు
మోకరించ కృష్ణుండు తా ముదము నందు
నిటుల నానంద సాగరమీది యీది
సాగు తెరటాల యూయెలల్ తూగి తూగి॥

గీ. కోరికల దీర్తునో సత్యకోప ముడుగు
మనుచు కృష్ణుండు వేడగ హత్తి కౌగ
లించి సత్యనీరాంజనం బిచ్చుచుండ
ముదము జెందుచు సుల్తాను మ్రొక్కె కృష్ణ॥

గీ. వయసు ముదిరిన వారవు బలుక శక్తి
ములను బరదించు నురుము సమ్మోద పడితి
విశద నాచార్య బిరుదునకు నీవె తగుదు
తరతరాల నీదు హృదయాన బాదుకొనియె॥

గీ. చిన్నవారలు వయసున నెన్న మీకు
నీదు జోడుగ కళలందు నిపుణనారి
తేరినారలు మెచ్చితి తీసికొనుడు
అగ్రహారంబు మీకిత్తు నంకితముగ॥

గీ. అనుచు సుల్తాను ప్రకటించి యపుదు తాను
సనదు వ్రాయించి రెప్పించి నంతకంబు
జేసి యిప్పించె నాచార్యు చేతి కపుడె
నాల్గు దిక్కుల విహరించె నాట్యలక్ష్మి॥

గీ. నాటినుండియు నేటికి నాట్యలక్ష్మి
వేయి కిరణాల కాంతులు విస్తరిల్ల
వాద వాదిత వేష కళావాహినులను
పొంగు లూరింతు రీ కూచిపూడి బుధులు॥

G-245

# ఫలశ్రుతి

గీ. భారతీ కంఠహారాన ప్రజ్వరిల్లు
కొలికి పూస భాగవతుల కూచిపూడి
చరిత మిది దీని పఠియించు సరసమతుల
కెలిమి నటరాజు కరుణ ప్రాప్తించు గాత॥

—: ఓం తత్సత్ :—

# తప్పొప్పుల పట్టిక

| పేజీ | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 10 | 14 | ఘనుడీ పా | ఘనుడీ శ్రీ పార్వతీశకవి పూరణమున్ |
| 11 | 26 | తోఁడ | గోపాలునితో |
| 14 | 9 | శిఖర | శిరమున |
| 17 | 18 | బూను | బూని |
| 18 | 2 | కలహము | కలహమ్ము |
| 23 | 24 | దక్కఁడ | నక్కఁడ |
| 27 | 3 | లక్షణ | లక్ష్మణ |
| 27 | 23 | గ్రమ్మి | గ్రమ్మి |
| 29 | 22 | గాంచుచు | గా ధరించు |
| 34 | 15 | వెంటునంటి | వెంట నంటి |
| 45 | 17 | లిధూ | వధూ |
| 48 | 4 | నారింజ | నారిజ |
| 49 | 13 | గిలయ | గలయ |
| 49 | 16 | యౌషధ | యౌషధమ్ము |
| 49 | 21 | వతౌవ | వతౌ |
| 51 | 16 | కడహరి | కడసారి |
| 51 | 22 | బాలగ | చాలగ |
| 58 | 2 | మార్గమున | మార్గము |
| 72 | 2 | వాలిరి | వావిరి |
| 76 | 2 | మేన్న | మెన్న |
| 77 | 20 | యుల్లము | యుల్లి |
| 79 | 1 | వేడ | వేడ్క |
| 80 | 15 | పాతాను | పాలౌను |

# శ్రీ వేదాన్తమ్ పార్వతీశమ్ గారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | భామా కలాపము | 6-00 |
| 2. | కూచిపూడి నృత్య దర్పణము | 10-00 |
| 3. | ప్రహ్లాద నాటకము | 6-00 |

## అముద్రణలు

1. చింతామణి (యక్షగానం)
2. నాట్యహేల (నృత్య నాటిక)
3. రణకేళి (నృత్య నాటిక)
4. ప్రవరాఖ్య (నృత్య నాటిక)
5. సిద్ధేంద్రుడు (గేయములు)
6. ఉరుములు — మెరుపులు (ఖండకావ్యము)
7. ఆత్మదర్పణ (ఖండకావ్యము)
8. జముకుల గేయములు (జాతీయములు)

## గ్రంథాంతర ముద్రణములు

1. ఎరుక
2. దక్షయజ్ఞము
3. అర్ధనారీశ్వరుడు
4. భాగవతుల కూచిపూడి (ఖండకావ్యము)
5. దాదినమ్మ వేషము
6. శివమోహిని
7. భ్రమర గీతములు
8. పార్వతీశు పదాలు

క్షేత్రయ్య మా తాత సిద్ధేంద్రుడు గురుడు
అల్లి లీలాశుకుండగును మామ —

శ్రీ బాలాజీ ప్రింటర్స్, సామారంగం చౌక్, విజయవాడ-520 001.